RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 293 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | ఆదివారం | జనవరి | 18 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00

### సికింద్రాబాద్‌పై ఆందోళనకు
## మద్దతిస్తాం:కిషన్‌రెడ్డి

హైదరాబాద్,జనవరి 17:మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ కోసం జరుగుతున్న పోరాటాలకు మద్దతిస్తామని చెప్పారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ స్పష్టత ఇచ్చారు. మరోవైపు. సికింద్రాబాద్‌లో అనూహ్య పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ ఉదయం నుంచి ఇక్కడ భారీగా పోలీసులు మోహరించారు. నిరసన తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన సికింద్రాబాద్ ఆనవాళ్లను తుడిచివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ ర్యాలీ నిర్వహించాలని తలపెట్టింది.



## అట్టుడుకుతున్న ఇరాన్..

### క్షేమంగా స్వదేశానికి చేరుకున్న
## భారతీయులు

**- ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని వెల్లడి**

**- పౌరులంతా తిరిగి రావాలన్న భారత విదేశాంగ శాఖ**

**- ఇరాన్‌లో దాదాపు 9,000 మంది భారతీయులు ఉన్నట్లు ప్రభుత్వ అంచనా**

ఢిల్లీ,: అల్లర్లతో అట్టుడుకుతున్న ఇరాన్ నుంచి పలువురు భారత పౌరులు క్షేమంగా స్వదేశానికి తిరిగివచ్చారు. భారత ప్రభుత్వం జారీ చేసిన సూచనల నేపథ్యంలో శుక్రవారం రాత్రి వారు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో తమను సురక్షితంగా తీసుకొచ్చినందుకు వారు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం, కరెన్సీ పతనం కారణంగా గత డిసెంబర్ చివరి నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా భద్రతా పరిస్థితి క్షీణించడం, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో అక్కడ ఉన్న భారతీయుల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం పలుమార్లు హెచ్చరికలు జారీ చేశాయి.

### ఇంట్లోకి చొరబడి..
## జోగు రామన్నను అరెస్టు చేసిన పోలీసులు



ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు అరెస్టు చేశారు. చనాకా కొరాటా బ్యారేజి శుద్ధికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లోకి అక్రమంగా చొరబడి అరెస్టు చేయడంపై జోగు రామన్న తీవ్రంగా మండిపడ్డారు. ఒక్క ఎకరాకు కూడా నీరు అందించలేని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవం ఎందుకు చేశారని జోగు రామన్న ప్రశ్నించారు. పాపాల భైరవుడు తిరిగిన చోటే నీరు రైతులకు అందది అనడానికి వీళ్లే నిదర్శనం అన్నారు. రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవాన్ని వ్యతిరేకిస్తూ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ శుద్ధి కార్యక్రమానికి పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ క్రమంలోనే ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. దీన్ని ప్రభుత్వ కుట్రగా అభివర్ణించారు.



### పట్టాలెక్కిన తొలి వందేభారత్
## స్లీపర్ రైలు

**జెండా ఊపిన ప్రధాని మోదీ**

ఢిల్లీ,: భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌవ్‌డా-అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.



### విద్యతోనే సమాజంలో
## గౌరవం


హైదరాబాద్: 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయి నపల్లి ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి ప్రధానమంత్రి నెహ్రూసాగునీటి ప్రాజెక్టులు, విద్యకు అత్య ధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీ టి ప్రాజెక్టులే నేటికీ జీవనాధారంగా నిలుస్తున్నా యని అన్నారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ దొరల వద్ద ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తు చేశారు. విద్యతోనే సమాజం లో గౌరవం లభిస్తుందని గుర్తించాలని సూచించారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.



### మున్సిపల్ ఎన్నికల్లో
## కీలక ముందడుగు

**రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**హైదరాబాద్, : తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల పక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్‌కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సం బంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శని వారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల పక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదా ఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం జీవో ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల య్యే అవకాశం ఉంది. 10 కార్పొరేషన్లలో ఎస్సీ-1,ఎస్టీ-1, బీసీ-3 (ఒకటి మహిళ) లకు కేటాయి ంచారు. జనరల్ కేటగిరీలో ఐదు స్థానాలకు గానూ ఏకంగా నాలుగు స్థానాలను మహిళలకు కేటా యించారు. 121 మున్సిపాలిటీల్లో ఎస్సీ-17, ఎస్టీ-5, బీసీ-38, జనరల్-61 కేటా యించడం జరిగింది.కార్పొరేషన్ల వారీగా రిజర్వేష న్లు.. ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ - ఎస్టీ (జనరల్), రామగుండం కార్పొరేషన్- ఎస్సీ (జనరల్),మహబూబ్‌నగర్ కార్పొరేషన్- బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్- బీసీ (జనరల్), కరీంనగర్ కార్పొరేషన్ - బీసీ (జనరల్), ఖమ్మం కార్పొరేషన్- మహిళ (జనరల్), నిజామాబాద్ కార్పొరేషన్- మహిళ (జనరల్), వరంగల్ కార్పొరేషన్- జనరల్, జీహెచ్ఎంసీ - మహిళ (జనరల్) నల్లగొండ కార్పొరేషన్- మహిళ (జనరల్) కు కేటాయించారు.**



### దేశ రాజధానిని కమ్మేసిన
## పొగమంచు

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశం మొత్తం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం తొమ్మిది గంటలు దాటినా సూర్యుడు కనిపించని పరిస్థితి నెలకొంది. విజిబిలిటీ తీవ్రంగా తగ్గిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో గాలిలో కాలుష్యం మరింత పెరగడంతో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 'వెరీ పూర్ణ స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలుతీసుకున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో జీఆర్‌ఏపి- కింద ఆంక్షలను మళ్లీ అమలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నిర్మాణ కార్యకలాపాలపై పరిమితులు విధించడంతో పాటు,డీజిల్ వాహనాల వినియోగాన్ని నియంత్రిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ లోని నోయిడా సెక్టర్-115 ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



### చత్తీస్‌ఘడ్‌లో
## ఎన్‌కౌంటర్

**ఇద్దరు నక్సల్స్ మృతి**

బీజాపూర్: చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతాదళాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు మృతిచెందారు. జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఇవాళ ఉదయం గన్‌ఫైట్ జరిగింది. భద్రతా దళాలకు చెందిన జాయింట్ టీమ్ .. నక్సల్స్ ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొన్నది. మావోయిస్టు కేడర్ ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఇప్పటి వరకు ఇద్దరు నక్సల్స్ మృతదేహాలను సేకరించినట్లు ఓ అధికారి చెప్పారు. ఆయుధాలను రికవరీ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఏకధాటికి ఫైరింగ్ జరుగుతోందని, దీనికి సంబంధించిన మరింత సమాచారం రావాల్సి ఉన్నది. బస్తర్ ప్రాంతంలో జనవరి 3వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో 14 మంది నక్సల్స్ మృతిచెందిన విషయం తెలిసిందే. గత ఏడాది చత్తీస్‌ఘడ్‌లో సుమారు 285 మంది నక్సలైట్లు ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది మార్చి 31 వరకు దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేయనున్నట్లు కేంద్రం పేర్కొన్న విషయం తెలిసిందే.



### ఇరాన్‌లో తీవ్ర
## ఉద్రిక్తత

**- పుతిన్, నెతన్యాహు చర్చ**

రష్యా : ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్‌లో చర్చించారు. నెతన్యాహూతో మాట్లాడిన పుతిన్.. ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో పరిస్థితులపై చర్చించారని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. ప్రాంతీయ స్థిరత్వం, భద్రత కోసం రాజకీయ, దౌత్యపరమైన ప్రయత్నాలకు సానుకూలంగా ఉన్నామని చెప్పారు. అన్ని స్థాయిల్లో సంబంధాలను కొనసాగించేందుకు ఇద్దరు నేతలు అంగీకరించారని క్రెమిన్ వెల్లడించింది.



### కోర్టు పర్మిషన్‌తో బ్రహ్మాండంగా
## మళ్లీ ర్యాలీ నిర్వహిస్తాం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్,: ఈ రెండేళ్ల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి పేర్లు మార్చడం తప్ప చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. టీఎస్‌ను టీజీగా మార్చారని తెలిపారు. దానివల్ల ఎవరికి లాభం జరిగిందని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి.. కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ రాజముద్ర నుంచి చార్మినార్‌ను తీసేస్తానని అంటున్నాడని తెలిపారు. ఇప్పటికే కాకతీయ కళాతోరణాన్ని తీసేశారని పేర్కొన్నారు. దిక్కుమాలిన తుగ్లక్ పనులు తప్ప.. రాష్ట్రానికి చేసింది శూన్యమని విమర్శించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. మీకు అధికారం ఇచ్చింది ప్రజల హక్కులు కాపాడటానికి అని రేవంత్ సర్కార్‌కు సూచించారు. కానీ మీరు చేస్తున్నదేంటి అని ప్రశ్నించారు. రెండేళ్లలో హైదరాబాద్‌లో ఒక్క కొత్త రోడ్డు వేశావా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఒక్క ఫ్లై ఓవర్ కట్టావా? అని ప్రశ్నించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని విమర్శించారు. సికంద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసిన పార్టీగా కాంగ్రెస్ మిగిలిపోతుందని కేటీఆర్ అన్నారు.రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ ఐడెంటిటీని తొలగించాలని చూస్తున్నాడని మండిపడ్డారు. అందుకే అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై ర్యాలీకి సిద్ధమయ్యారని తెలిపారు. పార్టీలకు అతీతంగా శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చారని అన్నారు. శాంతి ర్యాలీకి బీఆర్ఎస్ పార్టీని కూడా ఆహ్వానించారని తెలిపారు. మా ప్రజాప్రతినిధులమంతా సంఘీభావం తెలుపుదామని సిద్ధమయ్యామని పేర్కొన్నారు. కానీ వేలాది మందిని ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని తెలిపారు. తమను కూడా తెలంగాణ భవన్‌లో నిర్బంధించారని చెప్పారు. అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడుతామని తెలిపారు. కోర్టు పర్మిషన్‌తో బ్రహ్మాండంగా మళ్లీ ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ బిడ్డల మనోభావాలను బీఆర్ఎస్ పార్టీ గౌరవిస్తుందని తెలిపారు. అరెస్టు చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం కేసీఆర్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు తీసుకొచ్చారని పేర్కొన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని అన్నారు. హైదరాబాద్‌లో నాలుగు జోన్లు ఉంటే.. ఆరు జోన్లు చేసుకున్నామని అన్నారు. ఇన్ని చేసినా హైదరాబాద్ అస్తిత్వాన్ని బీఆర్ఎస్ ఏనాడూ టచ్ చేయలేదని స్పష్టం చేశారు. ఉన్న జిల్లాలను తీసేయడానికి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త కలెక్టరేట్లు అద్భుమని మీ మంత్రి కోమటిరెడ్డి అన్నాడని గుర్తుచేశారు. చేతనైతే సికింద్రాబాద్‌ను డెవలప్ చెయ్.. అంతేతప్ప ఫోర్త్ సిటీ పేరుతో తుగ్లక్ పనులు చేయకు అని రేవంత్ రెడ్డికి సూచించారు.

# మేదరి మహేంద్ర సంఘం డైరీ ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మహానది న్యూస్,జనవరి 17:** తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రూపొందించిన 2026 డైరీ ని శనివారం కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కాచిగూడ లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు జోర్రిగల శ్రీనివాస్, కోశాధికారి పాతకోటి ఉమ, వర్కింగ్ ప్రెసిడెంట్ కే. మురళీ కృష్ణ, ఉపాధ్యక్షులు జోర్రిగల శ్రీదర్, మంద కృష్ణ మాదిగ,పుట్ట యాదగిరి,కో ఆర్డినేటర్ కుమార్ మహేంద్ర, హైదరాబాద్ జిల్లా కోశాధికారిపాతకోటి మహేష్, రాజకీయ చైతన్య వేదికరాష్ట్ర అధ్యక్షుడు బొల్లం చంద్రమౌళి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు ప్యారసాని శ్రీనివాస్, సులువ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# 20న టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా సమావేశం



హైదరాబాద్,మహానది న్యూస్, జనవరి 17: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లాస్థాయి సమావేశం ఈనెల 20 వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు రాంనగర్ లోని రాజ్ ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో మాదిరిగా హైదరాబాద్ జిల్లాలో ఫెడరేషన్ కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా ఇటీవల హైదరాబాద్ లో పనిచేస్తున్న అనేక మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో సమాలోచన చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 20న జరిగే సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, పలువురు హైదరాబాద్ సీనియర్ జర్నలిస్టులు పాల్గొంటారని,ఈ సందర్భంగా జిల్లా అడ్ హక్ కమిటీ వేయడం జరుగుతుందని తెలిపారు. సభ్యత్వ నమోదు అనంతరం జిల్లా మహాసభ, నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని మామిడి సోమయ్య తెలిపారు. హైదరాబాద్ లో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఈ సమావేశంలో పాల్గొని టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు.

# పారదర్శకంగా మున్సిపల్ కౌన్సిలర్ల రిజర్వేషన్ల ఖరారు...

## -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,మహానది న్యూస్, జనవరి 17:** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, సీప్-2024 సర్వే ఆధారంగా మున్సిపల్ ఎన్నికలకు వార్డుల వారీగా రిజర్వేషన్లను అత్యంత పారదర్శకంగా ఖరారు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన మున్సిపల్ వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్ల ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అను గుణంగా, సీప్-2024 సర్వే జనాభా ప్రతినిధ్య ప్రాతిపదికన మున్సిపల్ ఎన్నికలకు వార్డుల వారీ రిజర్వేషన్లను అత్యంత పారదర్శకంగా ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. నిబంధనల ప్రకారం వనపర్తి, కొత్తకోట,పెబ్బేరు, ఆత్మకూరు, అమర చింత మున్సిపాలిటీల లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు జనరల్ కేటగిరీలలో మహిళలకు కేటా యించాల్సిన వార్డులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశామన్నారు. రిజర్వేషన్ల ఖరారు అనంతరం గెజిట్ విడుదలచేసి, తదుపరి జాబితా ప్రతులను కలెక్టరేట్ మరియు సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు, ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ గా పగుడాకుల బాలస్వామి



హైదరాబాద్, మహానది న్యూస్, జనవరి 17: విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ గా పగుడాకుల బాలస్వామి నియమితుల య్యారు. ఇటీవల జరిగిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో స్వామీజీల సమన్వయం కోసం ధర్మాచార్య బాధ్యతలను బాలస్వామికి అప్పగించారు. ఈ సందర్భంగా శనివారం పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సాధూ సంతులను సమన్వయం చేస్తూ..
ధర్మ రక్షణ కోసం కృషి చేస్తానని చెప్పారు.
మఠాలు, పీఠాలు, స్వామీజీల ఆశ్రమాలు, దేవాలయాల కేంద్రంగా హిందుత్వం సజీవంగా ముందుకు సాగేలా పనిచేస్తామన్నారు. కులాల మధ్య అంతరాలను చెరిపి, హిందూ సమాజమంతా ఒకటేనన్న భావన తీసుకువస్తామన్నారు. స్వామీజీల కేంద్రంగా హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడతామన్నారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని సమాజానికి తెలియజేసి,ధర్మ వ్యాప్తి కోసం నిరంతరం పనిచేస్తామని వివరించారు. తెలిసీ తెలియక మతం మారిన వారిని తిరిగి స్వధర్మం లోకి తీసుకువస్తామని చెప్పారు.
సాధూసంతుల మార్గదర్శనంలో ధార్మిక సదస్సులు ఏర్పాటు చేసి, హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తామన్నారు. దేవాలయాలపై, సాధూసంతులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు పోరాటం చేస్తామని బాలస్వామి అన్నారు.
హిందుత్వం బలపడితేనే భారతదేశం నిలబడుతుందని.. ప్రతి హిందువు సంఘటితం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. బౌద్ధ, జైన,సిక్కు తదితర ధర్మాలకు చెందిన వారిని కూడా సమన్వయం చేస్తూ.. ధర్మ కార్యంలో ముందుకు సాగుతామని ఆయన అన్నారు.

# ఐరాస జల సదస్సుకు పృథ్వీ రామ్‌కు ఆహ్వానం



**హైదరాబాద్,మహానది న్యూస్,జనవరి 17:** అంతర్జాతీయస్థాయి జలసదస్సుకు హైదరాబాద్‌కు చెందిన"వ్యవసాయ-జల నిపుణుడు" బొమ్మర బోయిన పృథ్వీ రామ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పశ్చిమ ఆఫ్రికా దేశమైన సెనగల్ రాజధాని డకార్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న 'ఐరాస అంతర్జాతీయ జలసదస్సు'లో పాల్గొనాలని ఆయనకు ప్రత్యేక ఆహ్వానం అందింది. నీటి భద్రత, వాతావరణ మార్పులు, వ్యవసాయ రంగ అభివృద్ధిపై పృథ్వీ రామ్ చేస్తున్న విశేష పరిశోధనలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి ఈ ఆహ్వానాన్ని పంపింది. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నజల వనరుల పరిశోధకులు, ప్రభు త్వ ప్రతినిధు లు పాల్గొని శుభ్రమైన నీరు, పారిశుద్ధ్య సాధనపై చర్చించనున్నారు.
ఈ ఏడాది(2026)డిసెంబర్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగబోయే మరో అంతర్జాతీయ సదస్సుకు ముందస్తు సన్నాహక కార్యక్రమంగా దీనిని నిర్వహిస్తున్నట్లు పృథ్వీ రామ్ తెలిపారు.
ఈ ఆహ్వానం దక్కడంపై తెలంగాణ ప్రభుత్వ పెద్దలు,పలువురు మేధావులు, జలవనరుల నిపుణులు పృథ్వీ రామ్ ను అభినందిస్తున్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి

## -ఆరు గ్యారంటీల కోసం కాంగ్రెస్ నాయకులను నిలదీయండి - ఎమ్మెల్యే సునీత రెడ్డి

## - నర్సాపూర్ లో పలు వార్డుల్లో ఎమ్మెల్యే సునీత రెడ్డి పర్యటన



నర్సాపూర్, మహానదిన్యూస్, జనవరి 17: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడిగెందుకు వస్తే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు క్యారెంటీలు ఎందుకు అమలుపరచలేదని నిలదీయాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రజలకు సూచించారు శనివారం నర్సాపూర్ లో పలు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన కాంగ్రెస్ బాకీ కార్డును పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు, కాంగ్రెస్ 25 నెలల పాలనలో నర్సాపూర్ మున్సిపాలిటీ కోసం చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లోనే నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని ఆమె గుర్తు చేశారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు ,ఈ కార్యక్రమంలో ఆమె వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నహీముద్దీన్, నాయకులు సత్యం గౌడ్, ఆనంద్ కుమార్, తౌంట వినోద్ ,షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి నిరు పేదలకు వరం

## - కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి



నర్సాపూర్,మహానది న్యూస్, జనవరి 17: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రెడ్డిఆవుల రాజిరెడ్డి అన్నారు. చిన్నచిత్తకుంట గ్రామానికి చెందిన ముగ్గురికి సీఎం సహాయ నిధి కింద 88 వేలు మంజూరు కాగా అట్టి చెక్కును శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లేష్, చిన్నచింతకుంట సర్పంచ్ సరిత మహేష్ గౌడ్, గ్రామస్తులు పెంటయ్య, సత్యనారాయణ, నరసింహారెడ్డి, చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



**వనపర్తి, మహానది న్యూస్, జనవరి 17:** వనపర్తి, పెబ్బేరు పట్టణాలకు, మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. శనివారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చెక్కులను పంపిణీ చేశారు. వనపర్తి పట్టణం, మండలానికి చెందిన 36 మందికి,హొపెబ్బేరు పట్టణం మండలం కు చెందిన హొమంజూరైన 36 చెక్కులను అందజేశారు. మొత్తం 72 చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు.ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులకు , కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల మంజూరు కోసం పైరవీ కారులను నమ్మి మోసపోకూడదని ఎమ్మెల్యే సూచించారు.
ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదుని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి,వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాగులపల్లి సర్పంచ్

## - ఆడబిడ్డ పెళ్లికి కానుకగా 5 వేల ఆర్థిక సాయం



నర్సాపూర్,మహానది న్యూస్, జనవరి 17: నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో ఆడబిడ్డ వివాహానికి శనివారం గ్రామ సర్పంచ్ సుమతి శివకుమార్ పెళ్ళి కానుకగా ఐదువేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్వోల్ సుమతి శివకుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ వివాహానికి తన వంతు సహాయంగా 5000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు . పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ వివాహానికి 5000 వేలు అందజేసినందుకు గ్రామస్తులు సర్పంచును అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఫయాజ్ ,మాజీ ఎంపిటిసి మేఘమాల కిషన్ ,పిఎసిఎస్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, కొర్వోల్ నర్సింలు, కొర్వోల్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బలమైన దేశీయ డిమాండ్‌తో ఇండియా..

ఒకప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న భారత్ ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక రంగంలో తనదైన ముద్ర వేస్తోంది. 140 కోట్లకు పైగా జనాభాతో అపారమైన మానవ వనరులతో బలమైన దేశీయ డిమాండ్‌తో ఇండియా దూసుకుపోతుంది. తాజాగా ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి కొత్త చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో జపాన్‌ను అధిగమించడం ఒక ముఖ్యమైన మైలురాయి. కేవలం రెండున్నర నుంచి మూడేళ్లలో జర్మనీని కూడా దాటి మూడో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ ఈ స్థాయికి చేరుకోవడానికి అనేక కారణాలు దోహదపడ్డాయనే చెప్పాలి. నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి గణాంకాలను తెలుపుతూ.. భారతదేశం 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని స్పష్టం చేశారు. బలమైన దేశీయ వినియోగం భారతదేశంలో భారీ జనాభా ఉండడం వల్ల దేశీయంగా వస్తువులు, సేవల వినియోగం గణనీయంగా పెరిగింది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఒక స్థిరమైన పునాదిని అందించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుదల ఆర్థిక వృద్ధికి దోహదపడింది. మౌలిక సదుపాయాల కల్పన (రోడ్లు, పోర్టులు, విద్యుత్), డిజిటల్ ఇండియా వంటి పథకాలలో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టింది. ఊు, దివాలా కోడ్ వంటి సంస్కరణలు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి. వ్యాపారం చేయడానికి సులువుగా ఉండే వాతావరణాన్ని కల్పించాయి. 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాలు దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాయి. ఐటీ, సాఫ్ట్‌వేర్ సేవలు వంటి వాటిలో భారత్ ఈ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. సేవల రంగం జీడీపీలో సింహభాగాన్ని కలిగి ఉంది. స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి తీసుకున్న చర్యలు, ప్రభుత్వ ఆర్థిక విధానాలు స్థిరత్వాన్ని అందించాయి. ఇది పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని చూస్తున్న ప్రపంచ కంపెనీలు, భారతదేశాన్ని ఒక ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా చూస్తున్నాయి. ముఖ్యంగా ఆపిల్ వంటి దిగ్గజ కంపెనీలు భారతదేశంలో తమ ఉత్పత్తిని పెంచాలని చూస్తున్నాయి. నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం చెప్పినట్లు.. డోనాల్డ్ ట్రంప్ వంటి వారు ఆపిల్ ఫోన్ల తయారీ అమెరికాలోనే జరగాలని డిమాడ్ చేస్తున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భారతదేశం ఆపిల్ ఫోన్లను మరింత చౌకగా తయారు చేయగల దేశంగా భారత్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇది భారతదేశానికి పెద్ద సానుకూల అంశం. రెండో విడత అసెట్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు.. దీనిని ఆగస్టులో ప్రకటిస్తామని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇది ప్రభుత్వానికి మరింత ఆదాయాన్ని సమకూర్చి, పెట్టుబడులకు దోహదపడుతుంది. ప్రస్తుతం ఈ ప్రపంచంలో టాప్ త్రీ ఆర్థిక వ్యవస్థల్లో అమెరికా, చైనా, జర్మనీ ఉన్నాయి. 2047 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ప్రధాని మోదీ చెబుతూ వస్తున్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలను వివరించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి, పరిశోధన అభివృద్ధి వంటి రంగాలపై మరింత దృష్టి పెట్టడం అవసరం. భారతదేశం కేవలం ఆర్థికంగానే కాకుండా ప్రపంచ వేదికపై తన ప్రభావాన్ని కూడా పెంచుకుంటోంది. 'విశ్వగురు'గా మారాలన్న లక్ష్యం, ఆర్థిక బలోపేతంతో మరింత సాధ్యమవుతుంది. అంతర్జాతీయంగా ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ సాఫీగా ముందుకు సాగుతోంది. బలమైన సూక్ష్మ ఆర్థిక వనరులు, ఆర్థిక విధానాల్లో స్థిరత్వం ఇందుకు దోహదపడుతున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, కమోడిటీ ధరల పెరుగుదల, భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావంతో ఫైనాన్షియల్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు మొదలైన సవాళ్లను ఎదుర్కొంటోంది. 2031 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ భారత ఆర్థిక వ్యవస్థ కోసం ఒక నివేదికను విడుదల చేసింది. ఈ కాలంలో దేశ జిడిపి వార్షిక వృద్ధి రేటు 6.7 శాతానికి తగ్గుతుంది. 2025 ఆర్థిక సంవత్సరం నుండి 2031 ఆర్థిక సంవత్సరం వరకు వార్షిక జీడీపీ కోవిడ్ మహమ్మారికి ముందు దశాబ్దంలో (10 సంవత్సరాలు) సగటు వృద్ధి రేటు 6.6 శాతంగా ఉంటుందని కూడా పేర్కొంది. ప్రపంచ పరిస్థితులలో ఏదైనా పెరుగుదల, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తత సరఫరా గొలుసులో అంతరాయం కలిగించవచ్చు దేశాల మధ్య వాణిజ్యంలో అంతరాయం ఏర్పడవచ్చు. ముడి చమురు ధరలు పెరగవచ్చు. ప్రపంచ సమస్యలు దేశ ద్రవ్యోల్బణం రేటును ప్రభావితం చేయవచ్చు. ఇన్‌పుట్ ఖర్చులు పెరగవచ్చుఆర్థిక లోటును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల ప్రభావం అభివృద్ధిపై కూడా కనిపించాలి. నివేదికలో, వాతావరణ పరిస్థితులు, భౌగోళిక–రాజకీయ అనిశ్చితులు వృద్ధి, ద్రవ్యోల్బణానికి ప్రధాన ప్రమాదాలుగా పరిగణించబడ్డాయి.

# ఏఐ.. వరమా..? శాపమా..?




ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా పయనిస్తున్న అత్యాధునిక సాంకేతికత కృత్రిమ మేధ (ఎఐ) యుగంలో జీవిస్తున్నాం. ఈ మధ్యకాలంలో విడుదలవుతున్న దాదాపు ప్రతి సాధనం (సాఫ్ట్‌వేర్) ఏఐ వెర్షన్‌ను అందిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం, ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు ఏదో ఒక రూపంలో ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారట! ఒక్క ఏఐ అనే కాదు ఏ సాంకేతికత అయినాసరే దాన్ని'మానవాళికి వరం' అంటూ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు! అయితే, ప్రతివ్యక్తికీ మోసగించే ప్రవృత్తి కూడా ఒకటి ఉంటుందని మరోపక్క శాస్త్రాలు హెచ్చరిస్తున్నాయి! ఇలాంటి పరిస్థితుల్లో, మనం ఏఐని సంపూర్ణంగా విశ్వసించగలమా? భగవద్గీత ప్రకారం, ప్రతీ ఆవిష్కరణ భగవంతుడు ప్రేరేపించిన బుద్ధితో ప్రకృతిలో సూక్ష్మ నియమాలను కనుగొనడం ద్వారా లభిస్తుంది. ప్రతి సాంకేతిక ఆవిష్కరణ ఒక కత్తితో పోల్చదగినది. ఒక వైద్యుడు కత్తిని ఉపయోగించి ఆపరేషన్ చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడగలడు. ఒక దుర్మార్గుడు అదే కత్తిని మరోవ్యక్తి ప్రాణాలను తీసేందుకూ ఉపయోగించగలడు. కాబట్టి, ఇక్కడ ప్రశ్న కత్తి మంచిదా, చెడ్డదా అని కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే అసలు విషయం. అదే విధంగా, ఏఐ సాంకేతికత స్వతహాగా మంచిదికానీ చెడ్డదికానీ కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే ముఖ్యం. ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించేందుకా, లేదా ధనికులుగా మారేందుకా! భగవత్ సంబంధితమైన సాంస్కృతిక విలువలను ప్రోత్సహించి సమాజంలో మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించేందుకా? కృత్రిమ మేధస్సు (ఎఐ), అణుశక్తి, ఇతర శక్తిమంతమైన సాంకేతికత ఏదైనా సరే, దానిని కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే కలిగే దుష్పరిణామాలను గురించి హరేకృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన శ్రీల ప్రభుపాదుల వారు తమ భగవద్గీత భాష్యంలో స్పష్టంగా హెచ్చరించారు. భౌతిక ప్రపంచంలో సాధ్యమైనంత వరకు సుఖం అనుభవించాలని ప్రయత్నిస్తూ, ఇంద్రియ సుఖాల కోసం ఏదో ఒక కొత్త దాన్ని కనిపెట్టడంలోనే వాళ్లు ఎల్లప్పుడూ నిమగ్నులై ఉంటారు. అలాంటి భౌతిక పరిశోధన ఫలితాలు మానవ నాగరికత పురోభివృద్ధిగా పరిగణించినప్పటికీ, ప్రజలు రోజురోజుకూ హింసాప్రాయులుగా, క్రూరులుగా తయారవుతున్నారు. జంతువుల పట్ల, సాటి మనుషుల పట్ల హింసా ప్రవృత్తిని పెంచుకుంటున్నారు. తోటి జీవులతో ఎలా మెలగాలో వారికి తెలియడం లేదు. తమ పరిశోధనల ద్వారా అందరికీ వినాశనాన్ని చేకూర్చే వస్తువులను కనిపెట్టే వాళ్లు ప్రపంచానికి శత్రువులుగా పరిగణన పొందుతారు. మనిషి పుటింది మొదలు గిట్టే వరకు సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తూనే ఉంటుంది. మనిషి తన మేధస్సుకు, మనుగడకు ఎదురయ్యే ప్రతి సమస్యలను, సవాళ్ళను అధిగమించి ఎప్పటికప్పుడు వాటిని అవకాశాలుగా మార్చుకుంటూనే వస్తున్నాడు. తాజాగా కృత్రిమ మేధస్సు (ఏఐ) మానవునికి సవాల్‌గా మారుతుందా అన్నది ఆలోచించాల్సిన అంశం. తన శారీరక శ్రమను తగ్గించుకోవడానికి అనేక రంగాల్లో పరిశోధనలు చేసి వాటికి పరిష్కార మార్గాలు కనుగొన్నాడు. ఇప్పుడు ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ కూడా మానవ సృష్టే అన్న విషయం మరువొద్దు. తన సౌలభ్యం కోసం సృష్టించిన ఏఐ ఇవాళ సొంతంగా ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకోవడమే కాదు అత్యంత వేగంగా, దోషరహితంగా పనిచేస్తుంది. మరి ఏఐ వరమా? శాపమా అన్న విషయాన్ని గమనిస్తే.. ఏఐ వచ్చి న తర్వాత సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగుల లేఆఫ్స్ పెరిగిపోతున్న వార్తలు తరచూ చూస్తూనే ఉన్నాం. నిజానికి ఏఐ రావడం వల్లనే ఉద్యోగాలు ఉడిపోతున్నాయనేది కేవలం అపోహ మా త్రమే. ఎందుకంటే ఏఐను సృష్టించింది మానవుడే. దానిని నియంత్రించే శక్తి కానీ, మెరుగుపరిచే సాంకేతికత కానీ మానవుడికే ఉంటుంది తప్ప ఏఐ తనంతట తానుగా అప్‌గ్రేడ్ చేసుకోలేదు. ఏఐ అప్‌గ్రేడ్ కోసం మళ్లీ మానవుడి తెలివితేటలే అవసరం అన్న విషయాన్ని గ్రహించండి. ఏఐ ఎప్పుడూ మనిషికి సేవకుడే కానీ పోటీదారుడు ఎంతమాత్రం కాదు. ఏఐను దాటడానికి పరిష్కార మార్గాలు కూడా మన చేతుల్లోనే ఉన్నాయి. నైపుణ్యాలు పెంచుకోవడం, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులతో ఏఐపై పట్టు పెంచుకోవడం చేయాలి. ఏఐ మనిషిలా ఆలోచిస్తుంది, కానీ మనిషిని మంచి సృజనాత్మకతను చేయలేదు. కళ, సాహిత్యం, సంగీతం, డిజైన్ రంగాలు ఎప్పటికీ సురక్షితమే. మానవుని భా వాలు, ఊహలు ఏఐకి ఎప్పటికీ రావు. మారుతున్న సాంకేతిక యుగంలో ఏఐ తదనంతరం కూడా కొత్త టెక్నాలజీ పుట్టుకొస్తూనే ఉంటుంది. వాటిని సృష్టించేది కూడా మానవుడే అనేది సత్యం. ఏఐ నిర్వహణ, ఏఐ ఎథిక్స్, ఏఐ భద్రత, గ్రీన్ టెక్నాలజీ, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ రంగాలు భవిష్యత్తులో మరింత విస్తరించనున్నాయి. నిరుద్యోగాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి. ప్రతీ మార్పు కొత్త అవకాశం కోసమే అన్నది గుర్తుంచుకోవాలి.

కొన్ని దశాబ్దాల కిందట అనేక నూతన యంత్రాలు, కంప్యూటర్ పరికరాలు వచ్చినప్పుడు కూడా కార్మికులు, ఉద్యోగులు ఇదే విధంగా భయపడ్డారు. కానీ ఎన్ని యంత్రాలు, పరికరాలు తయారైనా వాటిని ఆపరేట్ చేయాల్సింది మనుషులే. ఎందుకంటే వాటంతట అవి ఆపరేట్ చేసుకోగలిగే శక్తి ఉన్నా ఎంత మోతాదులో కావాలన్నది నిర్ణయించాల్సింది మనమే అన్న విషయం తెలుసుకోవాలి. మానవుని కోరికలు, అభిరుచులు అనంతం. వాటిని తీర్చుకోవడానికి మానవుడు ఎప్పటికప్పుడూ తన సృజనాత్మకతకు పదును పెడుతూనే ఉన్నాడు. ఇప్పు డు వచ్చిన ఏఐ విషయంలోనూ అదే జరుగుతుంది. ఏఐ పట్ల భయం, నిరుత్సాహం, నిస్తేజం అనవసరం. మానవుని ఆలోచనలు, అభిరుచులకు తగ్గట్లుగా మారే ఆలోచనా విధానం ఏఐలో లేవు. ఏఐ మానవ చరిత్రను మారుస్తుంది. కానీ మానవుడు దాని సృష్టికర్త అని మరువద్దు. ఏఐని ఉపయోగించి సమాజాన్ని మెరుగుపరచాలి. అలాగే ఏఐ యుగం ఎప్పటికీ మానవుని విజయమే.

# వర్తమాన అకృత్యాలపై రాజేసిన కొలిమి



ఇటీవల గొప్ప సామాజిక కవిత్వం రాస్తున్న వారిలో పతివాడ నాస్తిక్ ఒకరు. ఆయన వెలువరించిన కవితా సంపుటి 'కొలిమి రాజేయ్యాల్సిం దే' వర్తమాన సమాజానికి అవసరమైన స్వరం. ఈ మండే తన మనసు కొలిమినుంచి అక్షరాలను ఏరుకుంటాడు. వాటిని బాణాల్లా మార్చి సంధించటానికి విల్లును ఎక్కుపెట్టినప్పుడు ఇంక్విలాబ్ జిందా బాద్ నినాదాలు తప్ప, మరే మాటలు అతనికి వినిపించవు. చీకటి బజార్లో ముంచెత్తుతున్న దోపిడీ వాయుగుండాల వరద బీభత్సాన్ని మాత్రమే అతడు చూడగలుగుతాడు. తన చేతిలోని విల్లు తాడును లాగినప్పుడల్లా చెమట సంపద కొట్టుకుపోయి, దిక్కుతోచని దీనస్థితిలో వున్న బడుగు బతుక్కి భరోసా నిచ్చే ఒక శబ్దాన్ని కమ్యూనిజం వేదికగా ఈ కవి అందిస్తున్నాడు. కష్టజీవులంతా ఎర్ర సముద్రపు తరంగాల హోరులో కలిసి ఉద్యమించే రోజు వస్తుందని తన నమ్మకాన్ని ఒక జెండాలా అక్షరాల సాక్షిగా ఎగురవేస్తున్నాడు. కడుపులో లుంగచుట్టుకు పోతున్న పేగుల్ని తెంచుకొని పుట్టే పిడికిళ్లను గురించి చెబుతూ 'అవి మీ కంచాల మీద కలబడి/ మీ గోడౌన్ల మీదికి ఎగబడి/ మీ కొంపల్ని నేలమట్టం చేస్తాయి' అంటూ దోపిడీ వర్గాలకు పదునైన హెచ్చరికల్ని జారీచేస్తున్నాడు ఈ కవి.


నిబద్ధత కలిగిన కవుల వరుసల్లో సముచిత స్థానాన్ని అందుకున్న పతివాడ నాస్తిక్, వర్తమానంలో దిశా నిర్దేశాలు లేని కవులపట్ల తన నిరసనను తీవ్రమైన స్థాయిలోనే వ్యక్తం చేస్తున్నాడు. కష్టజీవుల కన్నీళ్ల తడిస్పర్శ అంటే ఏమిటో అర్థం కాకుండానే– పేదల ఆకలి మీద అలవోకగా కవిత్వాన్ని రాసే కవులందర్నీ ఒకచోట సమావేశపరిచి 'నువ్వు మురికివాడల్లోని/ ఇరుకు గుడిసెల్లోకి/ కష్టజీవుల్లోని/ చెమట చుక్కల్లోకి/ ప్రయాణించటం మొదలుపెట్టు/ అప్పుడు నువ్వు/ ఆకలిగొన్న చంటిబిడ్డకు/ అమ్మ కలిపిన పాలబువ్వలా/ కమ్మ కమ్మగా పరిమళిస్తావ్%ొ%' అంటూ ఉద్బోధిస్తున్నాడు. ఈ మాటల్ని వర్తమాన కవులు చాలామంది జీర్ణించుకొని, వాటిని పాఠాలుగా స్వీకరించి ప్రజాకవులుగా మిగిలిపోవాలని ఆశిస్తున్నాడు.

వానలు, వరదలు ముంచెత్తి, కొంపా గూడూ నాశనమై పోయి, కన్నీళ్లతో ఓదార్చుకుంటూ, కలిసి కలో గంజో సర్దుకుని పంచుకుంటు న్న ఎర్రకలువల పక్కన నిలబడి, వాళ్ల హదయ స్పందనను ఆసక్తిగా కవి వినిపిస్తున్నాడు. వాళ్ల కళ్లను వాళ్ల వేళ్లతోనే పొడిపించుకునేలా చేసిన నయావంచకులను ఎదురుగా నిలబెట్టి, గతంలో వాళ్లు చేసిన నిర్వాహకాలన్నింటినీ ఏకరువు పెడుతూ, కనురెప్పల మధ్య కోపాన్ని నిప్పుల్లా కురిపిస్తూ, పిడుగుల్లా మాటల్ని సంధిస్తూ 'చూడు../ నూటాయాభై కోట్ల బిందువులతో/ నిండిన ఈ సుందర సరోవరంలో/ ఎలుగెత్తే చైతన్యం వెల్లువలా లేస్తుంది/ ఎర్రని కలువలు పూసే/ మంచికాలం/ తప్పక నీ అంతు తేలుస్తుంది' అంటూ రేపటి కాలం మాత్రం మాదేనంటూ గర్జిస్తున్నాడు.

ఇది కష్టజీవుల చెమట వాసనతో పరిమళిస్తున్న కవిత్వం. రాజ్యం వెన్నులో వణుకు పుట్టించి, చట్టం కన్ను తెరిపించి, పేరుకున్న కుట్రల ముళ్ళ డొంకల్ని నరికివేసి, రేపటి ఉదయానికి ఈ రాత్రిని సిద్ధం చేయగల సూర్యబింబాలను పరిచయం చేస్తూ%ొ% 'వాళు ‿ గంజినీళ్లు కడుపు నిండా తాగి/ గుండె కమతాల్లో ఎర్రపూల వనాల్ని స్వప్నిస్తుం టారు / వాళ్లు రాగిజావ చేతినిండా జుర్రి/ మెదడు కొలుముల్లో చంద్ర నిప్పుకణాల్ని/ రాజేస్తూ వుంటారు/ దయచేసి మీ నగర జీవన మైకపు వలల్ని/ ఆ అమాయక జీవుల మీద విసిరి/ వాళ్ల బతుకుల్ని ఛిద్రం చేయకండి' అంటూ వురుములా వురిమిన ఈ మాటలు రేపటి పోరాటానికి ఇప్పుడే సంతకాలు చేస్తున్న గుండె సవ్వడిని వినిపిస్తున్నా యి. ప్రజల సమస్యల పట్ల, వారి బాధలు,

కష్టాలు, కన్నీళ్ల పట్ల, వాళ్లు ఎదుర్కొంటున్న దోపిడీ మూలాల పట్ల ఈ కవికి సమగ్రమైన అవగాహన వుది. ఆయన కవిత్వంలో తొందరపాటు లేని అర్థవంతమైన ఆలోచనల వరుసలు మనతో కరచాలనం చేయటం విశేషం. తన కవిత్వం ద్వారా పూర్తి విశ్వాసాన్ని పొందగలిగిన స్థాయిలో నిలబడి, అద్భుత భావజాల సమ్మిళితంతో, గొప్ప సజనాత్మక అనుభవాలను జోడించిన ఈ కవి, ఇజ్రాయిల్ చాలా పాశవికంగా పాలస్తీనా దేశంపై విరుచుకుపడుతున్న దాడిని తీవ్రమైన స్వరంతో ఖండిస్తూ 'నువ్వు ఎంత గట్టిగా కొడితే/ అంత గట్టిగా పైకి లేచి/ నరాల నిండా నెత్తుటి చైతన్యపు/ గాలితరంగాల్ని వెంటబెట్టుకొని/ చెక్కుచెదరని స్థైర్యంతో/ నిద్ర పోతున్న దిక్కుల/ గుండెలమీద గుద్ది మరీ/ మేల్కొపగల పాలస్తీనా/ పాలబుగ్గల తోలుబంతిని%ొ%' అంటూ తన కవితను దండోరా చేసి అందించిన శబ్దం, అక్షరాల తలపాగాలతో ఎప్పటికీ మనకు వినిపిస్తూనే వుంటుంది.

పతివాడ నాస్తిక్ కలంనుంచి వెలువడిన 'కొలిమి రాజేయ్యాల్సిందే!' కవితా సంపుటిలో అసలుసిసలైన వాస్తవ సంగతులు చాలా సారవంతంగా ఆవిష్కరించబడ్డాయి. ఆకలితో చుట్టుకుపోతున్న పేగుల కంఠస్వరాల శబ్దాలను నమోదు చేసిన ప్రయత్నమిది. జాతుల మధ్య, తెగల మధ్య, కులాల మధ్య, మతాల మధ్య, భాషల మధ్య, ప్రాంతాల మధ్య అగ్గిరాజేస్తున్న ద్రోహుల చరిత్రలను చీల్చి చెండాడే వేదికల్ని సిద్ధం చేసిన అంకితభావ చర్య ఇది. ఈ సంపుటి కవితల్లోని పదాలను చదవగానే భావం దృశ్యాలలోకి తర్జుమా గావించబడటం ఒక విశేషం. కణ, కణమని మండే నెత్తుటి మడుగులో మండే నిజాల, ఇజాల భావాల భాస్వర రూపాన్ని అందించిన ఈ కవి ఆలోచన మెచ్చుకోత గిందిగా వుంది. ఈ సంపుటిలోని చాలా కవితలు ఎర్రమందారాలుగా వికసించటానికి కారణం ఈ కవి ఆఫ్రికన్ కవుల్ని ఇష్టపడతాడు కాబట్టి, ఆ కవిత్వపు సారాన్ని తన ఎదుగుదలకు భూమికగా ఎంపిక చేసుకున్నాడు కాబట్టి, సామ్రాజ్యవాద ఉక్కుపాదాలను అక్షర ఫిరంగులతో పేల్చివేసిన లాటిన్ అమెరికన్ రచయితలను ఆరాధిస్తూ%ొ% పాబ్లో నెరుడా, గోర్కీ, శ్రీశ్రీ, శివసాగర్ మొదలైన కవుల కవిత్వ ఆలోచనా ధోరణుల్ని తన శ్వాసలో నింపుకున్నాడు కాబట్టి. సామాజిక చలన సూత్రాలను సంపూర్ణంగా అర్థం చేసుకున్న పతివాడ నాస్తిక్, ఈ సంపుటితోనే ఆగకుండా తన అక్షరాల కొలిమిని రాజేస్తూనే వుండాలని మనసారా ఆశిద్దాం. ప్రతుల కోసం (రూ.200) 94417 24167 నెంబర్లో సంప్రదించొచ్చు.



# ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఏ ఆహారాలను తినాలి..?

## వేటిని తినకూడదు..?

మనం రోజూ ఉదయం వివిధ రకాల బ్రేక్‌ఫాస్ట్‌లను తింటుంటాం. కొందరు ఇడ్లీలను తింటే, ఇంకొందరు దోశ, ఇంకా కొందరు పూరీ, చపాతీ, ఉప్మా వంటి అల్పాహారాలను తింటుంటారు. ఇక ఉదయం అన్నం తినే వారు కూడా చాలా మందే ఉన్నారు. అయితే పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం ఉదయం మనం తీసుకునే ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉండేలా చూసుకోవాలి. దీంతో మనకు ఆ రోజుకు కావల్సిన పోషకాలు ఉదయం ఆహారం నుంచి లభించడమే కాదు, శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. దీంతో రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. నీరసం, అలసట రాకుండా ఉంటాయి. ఉత్సాహంగా ఉంటారు. ఉత్తేజంగా పనిచేస్తారు. ఈ క్రమంలోనే ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి, వేటిని తీసుకోకూడదు.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

ఫైబర్, ప్రోటీన్లు ఉండేలా..: ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో సంక్లిష్టమైన కార్బొహైడ్రేట్లు ఉండే ఆహారాలను తింటే మంచిది. బ్రౌన్ బ్రెడ్, ఓట్స్, రాగులు, జొన్నలు వంటి చిరు ధాన్యాలతో చేసిన టిఫిన్లు, పోహా, పప్పు దినుసులతో తయారు చేసే ఇడ్లీ లేదా దోశ వంటివి, కినోవా వంటి ఆహారాలను తింటే మంచిది. ఇవి శరీరానికి శక్తిని, పోషణను అందిస్తాయి. శరీరం రోజంతా యాక్టివ్‌గా ఉండేలా చూస్తాయి. అలాగే ఉదయం అల్పాహారంలో ప్రోటీన్లు ఉండేలా కూడా చూసుకోవాలి. కోడిగుడ్లు, పనీర్, మొలకలు, పప్పు దినుసులు, పెరుగు, బాదం, పిస్తా, జీడిపప్పు, చియా సీడ్స్, అవిసె గింజలు, పల్లీలు వంటివి తింటే ప్రోటీన్లు లభిస్తాయి. ఇవి కండరాలను నిర్మించడమే కాదు, శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తాయి. రోజంతా చురుగ్గా ఉండేలా చేస్తాయి. నీరసం, అలసట రానివ్వవు.

ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ముఖ్యమే..: అవకాడో, నట్స్, సీడ్స్, నెయ్యి, ఆరోగ్యవంతమైన నూనెలను కూడా ఉదయం తీసుకుంటే మంచిది. అలాగే అరటి పండ్లు, యాపిల్స్, బెర్రీలు, బొప్పాయి, పుచ్చకాయ వంటి పండ్లను మీరు తినే టిఫిన్‌లో చేర్చుకుని తింటే మంచిది. దీంతో పోషకాలను అమితంగా పొందవచ్చు. అలాగే క్యాల్షియం లభించేందుకు గాను ఉదయం పాలను తీసుకోవచ్చు. జంతు సంబంధ పాలు అంటే అలర్జీ ఉన్నవారు సోయా పాలు, బాదం పాలను తాగవచ్చు. ఇక బ్రేక్ ఫాస్ట్‌లో తీసుకోకూడని ఆహారాలు కూడా ఉన్నాయి. అవేమిటో ఇప్పుడు చూద్దాం. చక్కెర అధికంగా ఉండే ఆహారాలు, పేస్ట్రీలు, బేకరీ ఐటమ్స్, తీపి అధికంగా ఉండే పాన్ కేక్స్, వాఫెల్స్ వంటివి తినకూడదు.

ఇవి వద్దు..: ఉదయం టీ, కాఫీ తాగేవారు చక్కెర లేకుండా తాగితే మంచిది. లేదా బ్లాక్ టీ, బ్లాక్ కాఫీ, లెమన్ టీ సేవించవచ్చు. వీటిల్లోనూ చక్కెర కలపకుండా తాగాలి. కావాలంటే కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగవచ్చు. అలాగే ప్రాసెస్ చేయబడిన పండ్ల రసాలు, స్టోర్‌లలో కొనుగోలు చేసిన స్మూతీలు, చక్కెర ఎక్కువగా ఉండే పెరుగుకు సంబంధించిన ఆహారాలు, నూనె పదార్థాలు, వేపుళ్లు, రాత్రి మిగిలిన కూరలు, కొవ్వు ఆహారాలు, అన్నం వంటి వాటిని ఉదయం ఎట్టి పరిస్థితిలోనూ తినకూడదు. ఇవన్నీ అనారోగ్యాలను కలగజేస్తాయి. వ్యాధులకు మూల కారణం అవుతాయి. కనుక ఉదయం మీరు తినే ఆహారం ఆరోగ్యవంతమైనదిగా, పోషకాలను, శక్తిని అందించేదిగా ఉండాలి. అప్పుడు మీరు యాక్టివ్‌గా ఉండడమే కాదు, ఎలాంటి రోగాలు రాకుండా సురక్షితంగా ఉంటారు. ఆయుర్దాయం కూడా పెరుగుతుంది.

# పిల్లలతో ఇవి తాగించండి..




**పిల్లలను హైడ్రేటెడ్‌గా ఉంచడం చాలా ముఖ్యం. శీతల పానీయాలకు బదులుగా, ఇంట్లో తయారుచేసిన పండ్ల రసాలను ఇవ్వాలి. వేసవిలో పిల్లలకు ఇవ్వడానికి అనువైన 4 ప్రత్యేక రకాల జ్యూస్‌లు ఉన్నాయి.**

నారింజ రసం : నారింజ రసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది పిల్లల రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా దోహదపడుతుంది.

పుచ్చకాయ రసం : వేసవిలో పిల్లలకు పుచ్చకాయ రసం మంచి ఎంపిక. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది పిల్లలను హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, పుచ్చకాయ రసంలో విటమిన్ సి, లైకోపీన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పుచ్చకాయ రసం పిల్లల కడుపును చల్లగా ఉంచుతుంది. పిల్లలు రోజంతా తాజాగా ఉంటారు.

బొప్పాయి రసం : బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయ పడుతుంది. దీనితో పాటు, బొప్పాయి రసంలో విటమిన్ సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బొప్పాయి రసం తయారు చేసి పిల్లలకు ఉదయం, సాయంత్రం ఇవ్వవచ్చు.

ద్రాక్షపండు రసం : పిల్లలకు ద్రాక్ష రసం అంటే చాలా ఇష్టం. పిల్లలకు కూల్ డ్రింక్‌కు బదులుగా ద్రాక్ష రసం ఇవ్వొచ్చు. ద్రాక్షలో పొటాషియం, విటమిన్ సి ఉన్నాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీనితో పాటు ద్రాక్ష రసం హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా సహాయ పడుతుంది.



# వాటర్ యాపిల్స్‌ను అంత తేలిగ్గా తీసుకోకండి..

## వీటితో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు..!

వాటర్ యాపిల్.. దీన్నే రోజ్ యాపిల్ లేదా వ్యాక్స్ యాపిల్ అని కూడా పిలుస్తారు. ఒకప్పుడు ఇవి కేవలం విదేశాల నుంచి మాత్రమే దిగుమతి అయ్యేవి. కానీ ఇప్పుడు మన దగ్గర కూడా ఈ పండ్లను పండిస్తున్నారు. వాటర్ యాపిల్ పేరుకు తగినట్లుగానే 90 శాతం మేర నీటిని కలిగి ఉంటుంది. ఇవి పండనప్పుడు ఆకుపచ్చగా, బాగా పండినవి పింక్ రంగులో ఉంటాయి. ఈ పండ్లు కాస్త చప్పగా ఉంటాయి. కానీ ఇవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు అద్భుతమనే చెప్పాలి. వాటర్ యాపిల్స్‌ను తినడం వల్ల శరీరానికి నీరు లభించడమే కాదు, అనేక రకాల విటమిన్లు, మినరల్స్‌ను కూడా పొందవచ్చు. ఈ పండ్లలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాటర్ యాపిల్స్‌ను తినడం వల్ల శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలోని వేడి తగ్గిపోతుంది.


**జీర్ణ వ్యవస్థకు..:** వాటర్ యాపిల్‌లో విటమిన్లు సి, ఎ, ఇ, బి1, బి2, బి3 సమృద్ధిగా ఉంటాయి. అలాగే పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్ కూడా అధికంగా లభిస్తాయి. వాటర్ యాపిల్స్‌లో ఉండే విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. ఇది తెల్ల రక్త కణాలు పెరిగేలా చేస్తుంది. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను తగ్గిస్తుంది. వాటర్ యాపిల్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ప్రీ బయోటిక్ ఆహారంగా ఈ పండ్లు పనిచేస్తాయి. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉండేలా చూస్తాయి. దీంతో జీర్ణ వ్యవస్థలో ఆహారం కూడా సులభంగా కదులుతుంది. అలాగే మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**షుగర్ లెవల్స్ తగ్గేందుకు..:** డయాబెటిస్ ఉన్నవారికి వాటర్ యాపిల్స్ ఎంతో మేలు చేస్తాయి. వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు అంత త్వరగా పెరగవు. ఈ పండ్లలో ఉండే ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు తరచూ వాటర్ యాపిల్స్‌ను తింటే ఫలితం ఉంటుంది. అలాగే వాటర్ యాపిల్స్‌లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కొవ్వు ఉండదు. సోడియం కూడా ఉండదు. ఫైబర్, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. బీపీని నియంత్రణలో ఉంచుతాయి. దీంతో గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. హార్ట్ ఎటాక్‌లు రాకుండా నివారించవచ్చు. వాటర్ యాపిల్స్‌లో ఉండే నియాసిన్ కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించేందుకు పనిచేస్తుంది. అందువల్ల ఈ పండ్లను తింటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**క్యాన్సర్ రాకుండా..:** వాటర్ యాపిల్స్ లో అధికంగా ఉండే విటమిన్లు సి, ఎ, ఫినోలిక్ సమ్మేళనాలు యాంటీ ఆక్సిడెంట్లలా పనిచేస్తాయి. ఇవి కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. వాటర్ యాపిల్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి చర్మానికి సూర్య కిరణాల వల్ల జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కాలుష్య కారకాలు, ఫ్రీ ర్యాడికల్స్ వల్ల చర్మానికి కలిగే హాని తగ్గుతుంది. వాటర్ యాపిల్స్‌ను తినడం వల్ల ప్రారంభ దశలో ఉండే క్యాన్సర్‌ను సులభంగా తగ్గించవచ్చని పరిశోధకులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇలా వాటర్ యాపిల్స్‌ను తరచూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# లో బీపీ లోతుపాతులు

చాలామంది అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్)తో బాధపడుతుండటం తెలిసిన విషయమే. అయితే, కొంతమంది మాత్రం లో బీపీతో బాధపడుతుంటారు. దీన్ని వైద్య పరిభాషలో హైపోటెన్షన్ అంటారు. రక్త పీడనం స్థాయులు సాధారణం కంటే తక్కువకు పడిపోయినప్పుడు ఈ స్థితి తలెత్తుతుంది. అంటే బీపీ 90/ 60 ఎంఎం హెచ్‌జీ కంటే తక్కువగా నమోదవుతుంది. లో బీపీ వివిధ కారణాల వల్ల తలెత్తు తుంది. డీహైడ్రేషన్, గుండె సమస్యలు, వాడుతున్న మందులు లాంటివి లో బీపీకి కొన్ని కారణాలు. కొన్ని లక్షణాలను గుర్తిస్తేలో బీపీని పసిగట్టవచ్చు.



అవేంటంటే తలతిప్పడం: లో బీపీకి చాలా సాధారణమైన సంకేతం తలతిప్పడం(కండ్లుతిరగడం) లేదాతల తేలిగ్గా ఉండటం.మరీ ముఖ్యం గా తొందరగా లేచే ప్రయత్నం చేసినప్పుడు ఇలా ఉంటుంది. రక్తపోటు స్థాయులు అకస్మాత్తుగా పడిపోవడంతో మెదడుకు రక్త ప్రసారం తగ్గిపోతుంది. దీంతో తల తిరిగినట్టుగా లేదా అస్థిరంగా అనిపిస్తుంది.

మసక మసగ్గా కనిపించడం: చూపు మసకగా, తెరలుగా కనిపించడం కూడా లో బీపీ సంకేతమే. రక్తపోటు అకస్మాత్తుగా పడిపోయినప్పుడు ఇలా జరుగుతుంది. మెదడులాగా కండ్లకు కూడా నిరంతరం రక్త సరఫరా జరుగుతూ ఉండాలి. అయితే, రక్తపోటు స్థాయులు పడిపో యినప్పుడు కండ్లు ఆక్సిజన్‌ను సరిపోయినంతగా స్వీకరించ లేవు. ఇది చూపునకు సంబంధించిన సమస్యలకు దారితీస్తుంది.


అలసట బలహీనత: లో బీపీ ఉన్నప్పుడు ఎడతెగని అలసట, కండరాల బలహీనత పీడిస్తాయి. రక్తపోటు స్థాయులు పడిపోవడంతో మన శరీరంలోని అవయవాలు, కండరాలు తగినంత ఆక్సిజన్‌ను, పోషకాల ను గ్రహించలేవు. దీంతో అలసటగా, నిస్త్రాణగా అనిపిస్తుంది.

రక్తపోటు పడిపోయినప్పుడు మన శరీరం మెదడు, గుండె లాంటి కీలకమైన అవయవాలకు రక్తాన్ని పంపించడం మీద దృష్టి సారిస్తుంది. ఇది చర్మం, చేతులు, కాళ్లు పాలిపోవడానికి, చల్లబడటానికి దారితీస్తుంది. చర్మం కూడా చెమటగా, జిగటగా తయారవుతుంది. శరీరం ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేసే ప్రయత్నం చేస్తుంది కాబట్టి, ఇలా జరుగుతుంది.

గుండె కొట్టుకోవడం క్రమం తప్పడం: రక్తపోటు స్థాయులు పడిపోయినప్పుడు రక్త ప్రసారం సరిగ్గా జరగడానికి గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇది గుండె కొట్టుకోవడాన్ని క్రమరహితంగా లేదంటే బాగావేగంగా మారుస్తుంది. ఇది ఒక్కోసారి తక్కువ, మరీ తక్కువ శ్వాస (షాలో బ్రీతింగ్)తో కూడా జరగవచ్చు. బీపీ అంటే మనశరీరంలో ధమనుల్లో రక్తం ప్రవహించే పీడనం. గుండె కొట్టుకున్నప్పుడురక్తం ధమనుల్లో చేరుతుంది. వీటి ద్వారా శరీరం అంతటికీ ప్రసారమవుతుంది. అయితే, మన రక్తపోటు అన్నివేళలా ఒకేలా ఉండదు.వయసు, మందులు తదితర కారణాల వల్ల అది మారుతూ ఉంటుంది. ఇక పైన వివరించిన లో బీపీ లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించి, తగిన చికిత్స తీసుకోవాలి.

# విటమిన్-డిని ఎక్కువగా అందించవచ్చా

నమస్తే మేడం. ఇతర దేశాల్లాగే మనమూ ఈ సమయంలో శరీరానికి విటమిన్-డిని ఎక్కువగా అందించవచ్చా. అలా అయితే ఏ సమయంలో ఎండలో గడపాలి. దాన్ని శోషించుకునేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుపగలరు. మనది సమశీతోష్ణ మండలం. చక్కగా సూర్యుడు ప్రతిరోజూ ఉదయించి ఎన్నో గంటలు ఉంటాడు. నిజానికి ఇలాంటి వాతావరణంలో విటమిన్-డి లోపం రాకూడదు. కానీ మనం కేవలం నీడ పట్టునే ఉండటం వల్ల ఈ సమస్య వస్తుంది. సహజంగా సూర్యకాంతి నేరుగా చర్మానికి తాకినప్పుడు శరీరంలో విటమిన్-డి ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒక రోజులో కనీసం పావుగంట ఇలా శరీరం మీద ఎండ పడేలా చూసుకోవాలి. భారతదేశంలో ఉన్నవాళ్లకు ఏడాదంతా విటమిన్-డి వస్తుంది. మంచు దేశాల్లోలాగా మనకు ఎండకాలంలో మాత్రమే





ప్రత్యేకంగా ఇది అందుతుంది అన్నది ఏం ఉండదు. కాకపోతే వేసవిలో పగటి సమయం ఎక్కువగా ఉండటం వల్ల సాధారణం కన్నా ఎక్కువగా ఎండకు ఎక్స్‌పోజ్ అవుతాం. కాబట్టి ఈ సమయంలో విటమిన్ స్థాయులు పెరుగుతాయి. ఇక, వేసవిలో విటమిన్-డి కావాలనుకున్నప్పుడు ఉదయం ఆరున్నర ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య, సాయంకాలం అయిదు తర్వాత ఎండలో ఉండటం మంచిది. వేడి ఎక్కువ ఉన్న సమయంలో బయటికి వెళ్లకపోవడమే ఉత్తమం. లేకపోతే శరీరం డీ హైడ్రేషన్ బారినపడే ప్రమాదం ఉంటుంది. ఇక విటమిన్-డి శోషణలో చర్మపు రంగు అన్నది కూడా ముఖ్యమే. అంటే లేత రంగు చర్మ ఛాయ ఉన్నవాళ్లతో పోలిస్తే ముదురు రంగు చర్మం ఉన్నవాళ్లలో డి విటమిన్ శోషణకు ఎక్కువ సమయం పడుతుంది. అందుకే తెల్లవాళ్లతో పోలిస్తే మనలాంటి ఆసియా దేశాల వారు మరికాస్త ఎక్కువ సేపు ఎండలో గడపాలి. అలాగే విటమిన్-డి మన శరీరంలో సమృద్ధిగా తయారవ్వాలంటే పండ్లూ, ఆకుకూరలూ, మాంసకృత్తులూ కలగలిపిన సమతులాహారం తీసుకోవడం తప్పనిసరి.

# ఐక్య పోరాటంతోనే రిజర్వేషన్లు



దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ముసుగులో విద్రోహ పాలన కొనసాగుతున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా, నేటికీ బలహీనవర్గాలకు, అత్యంత వెనుకబడిన సంచార జాతుల ప్రజలకు రాజ్యాధికారం దక్కడం లేదు. ఇప్పటికీ ఆధిపత్య వర్గాల చేతుల్లో బీసీలు నయవంచనకు గురవుతూనే ఉన్నారు. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు వర్గీకరణతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మోసం చేయడమే అందుకు తాజా ఉదాహరణ. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతుతో చట్టసభల్లో ఆమోదించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించిన రాష్ట్ర పాలకులు ఒక పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు అమల్లోకి రాకుండా కుట్ర చేస్తున్నారు. ఇది తమను మభ్యపెట్టే ప్రయత్నమని బీసీ సంఘాలు, బీసీ మేధావులు, బీసీ సమాజం పసిగట్టకపోవడం బాధాకరం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4), 15 (5), 16 (4) ప్రకారం.. బీసీ కులాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించారు. అదే విధంగా స్థానిక సంస్థల్లో ఆర్టికల్ 243 ప్రకారం బీసీ కులాలను వెనుకబడిన పౌరులుగా గుర్తించారు. భారత రాజ్యాంగంలో సరైన విధంగా గుర్తించకపోవడం బీసీ కులాలకు శాపంగా మారింది. రాజ్యాంగంలో బీసీలకు సంబంధించిన ఆర్టికల్స్‌లోని లోపాల ఆధారంగా వెలువడుతున్న సుప్రీంకోర్టు తీర్పులు కూడా బలహీనవర్గాలకు నష్టం చేకూరుస్తున్నాయి. రాజ్యాంగంలో వెనుకబడిన కులాలను వెనుకబడిన తరగతులుగా, వెనుకబడిన పౌరులుగా గుర్తించినందున రాజ్యాంగ సవరణ చేయకుండా, ఇప్పటికిప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించలేమని కాంగ్రెస్ పాలకులకు తెలుసు. అయినా, కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ కోటాను 42 శాతానికి పెంచి, వర్గీకరణ ద్వారా రిజర్వేషన్లు అమలుచేస్తామని హామీ ఇచ్చింది. బీసీ వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులపై రిజర్వేషన్లు కల్పించే బాధ్యత ఉన్నది. కాబట్టి, గతంలో కోర్టులు వెలువరించిన తీర్పుల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయవచ్చని బీసీ సామాజిక ఉద్యమకారులు, న్యాయ నిపుణులు కాంగ్రెస్ పాలకులకు సూచిస్తున్నారు. ఆ తీర్పులను ఒక్కసారి పరిశీలిద్దాం. 1992లో 9 మంది జడ్జిలతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన మండల్ కమిషన్ తీర్పును వెలువరించింది. ఇందులో ప్రధానంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని నిబంధనను విధిస్తూనే.. ఒకవేళ బీసీ గణాంకాలు ఆమోదయోగ్యంగా ఉండి, ప్రత్యేక పరిస్థితుల్లో బీసీల ప్రాతినిధ్యం లేనట్టయితే 50 శాతానికి మించి కూడా రిజర్వేషన్లను అమలు చేసుకోవచ్చని అదే తీర్పులో తెలిపింది. ఈ తీర్పు ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయవచ్చు కదా?

2022లో బీఆర్ఎస్ సర్కార్ ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచడంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు 54 శాతానికి చేరుకున్నాయి. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి రిజర్వేషన్లు 64 శాతానికి చేరుకున్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే రాష్ట్ర పాలకులు భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను నిర్ధారించి అమలుచేయాలి. అంతేగానీ, ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం లేదనే విషయాన్ని గమనించాలి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బీసీ బిల్లులను అమలుచేసి బీసీ కులాలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను వర్గీకరణ ద్వారా వెంటనే అమలు చేయాలి. ఎందుకంటే అధికార పక్షంతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు శాసనసభలో ఈ బిల్లులకు మద్దతు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో రిజర్వేషన్లను అమలు చేస్తే అన్ని రాజకీయ పక్షాలు అండగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. ఒకవేళ ఈ విషయంలో ఎవరైనా పార్టీపరంగా గాని, సంస్థలపరంగా గాని, వ్యక్తుల పరంగా గాని హైకోర్టు, లేక సుప్రీంకోర్టులో కేసులు వేసినట్టయితే, రాష్ట్ర బీసీ జాబితాలో అత్యంత వెనుకబడిన సంచార జాతుల కులాలు ఇప్పటి వరకు ఎలాంటి రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు పొందలేదని, వారికి పదవులు దక్కలేదని కోర్టులకు తెలపాలి. అలాగే సామాజికపరమైన రిజర్వేషన్ ఫలితాలు వీరి దాకా చేరనేలేదనే విషయాన్ని తెలియజేయాలి.

బుడబుక్కల, దాసరి, దొమ్మర తదితర కులాలవారు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ఉన్నాయని ఇప్పటి వరకు పాలకులకు, 99 శాతం మంది అధికారులకు తెలియదు. ఈ కులాల అభ్యున్నతికి ఇకనైనా పాటుపడకపోతే ఎలా? విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఈ కులాల ప్రాతినిధ్యాల లెక్కలను కోర్టుల ముందుపెట్టి రిజర్వేషన్లను సాధించాలి. మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా వర్గీకరణతో కూడిన రిజర్వేషన్లు కల్పించాలి. లేకపోతే కాంగ్రెస్ పార్టీని బీసీ వర్గాలు మరోసారి నమ్మవు. అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని బీసీ రిజర్వేషన్లపై న్యాయ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి. అందుకోసం రాజ్యాంగాన్ని సవరించాలి. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బీసీల సమస్యను శాశ్వతంగా తీర్చాలి. రాజ్యాంగంలో విద్య, ఉద్యోగ ఇతర అంశాలకు సంబంధించిన అధికరణల్లో బీసీ తరగతులను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అధికరణల్లో కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. ఐక్యకార్యాచరణతో రాజకీయ చైతన్య యుద్ధానికి బీసీలు సిద్ధం కావాలి. సాధించే వరకు పోరాటం

## రామయపల్లి గ్రామాన్ని సింగరేణి సంస్థ తీసుకోవాలి

కమాన్ పూర్: వ్యవసాయ భూములు మాత్రమే తీసుకుంటామంటే ఊరుకునేది లేదని రామయ్యపల్లి గ్రామాన్ని క డా సింగరేణి సేకరించాలి అని పేర్కొన్నారు.సింగరేణి విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం మాజీ ఎంపీపీ అరెల్లిదేవక్క కొమురయ్యగౌడ్ హెచ్చరించారు రామగిరి మండలంలోని సింగరేణి ఓసీపీ టూ విస్తరణ కోసం సింగరేణి యాజమాన్యం రాజా పూర్ గ్రామంతోపాటు 444 ఎకరాల భూమిని తీసుకుంటామని ప్రతిపాధిస్తున్నట్టు సింగరేణి జీఎం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు రామగిరి మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ పేర్కొన్నారు. సింగరేణి ఓసీపీ టూ విస్తరణలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బుధవారంపేట, రాజాపూర్ గ్రామాల పరిధిలోని 708 ఎకరాల వ్యవసాయ భూమిని గతంలో సింగరేణి అధికారులు స్వాధీ నం చేసుకున్నారు. దీనిపై రెండు గ్రామాల రైతులు కోర్టుకు వెళ్లగా ఆ భూమిని తిరిగి రైతులకు ఇవ్వడం జరిగింది.



## మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

కొడిమ్యాల: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ కొడిమ్యాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపి రిజిస్టర్స్ రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ రూమ్‌లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకో వాలని, మందులను ఎక్స్పైరీ డేట్ చూసుకుంటూ పేషెంట్స్ కి ఇవ్వవలెనని తెలిపారు. తర్వాత ఇమ్మ్యునైజేషన్ గదిని పరిశీలించారు. పిల్లలకు ఇచ్చే టీకాలను సరైన టెంపరేచర్ నందు భద్రపరచవలనని సూచించారు. ల్యాబ్ ను పరిశీలించి పేషెంట్స్ కి అవసరమైన రక్త పరీక్షలు చేసి తగిన మందులు ఇవ్వవలెనని చెప్పారు. మాదకద్రవ్యాలు వాడడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, జీవితాలు కోల్పోతారని, కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని జరిగే అనర్థాల గురించి ప్రజలకు సిబ్బందికి అవగాహన కల్పిస్తూ సిబ్బంది ప్రజల చేత మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ తో పాటు జిల్లా ఇమ్మ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ మండల వైద్య అధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ పరమేశ్వరి, డిపిఓ (ఎన్సిడి) రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, జిల్లా సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్, సత్యప్రసాద్, సూపర్వైజర్లు వెంకట నరసమ్మ, అలివేలు, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు

## ఊడ్చే యంత్రాలతో ఖజనా ఊడ్చేశారు...

హైదరాబాద్, : సాధారణంగా పారిశుధ్యానికి నగరపాలక సంస్థలు భారీగా ఖర్చు పెడుతుంటాయి. ఒకప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ మొత్తం మనుషులు చేసేవారు. అయితే నగరాలు విస్తరించడం వల్ల.. శివారు ప్రాంతాలు పెరిగిపోవడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ మనుషుల వల్ల కావడం లేదు. అందుకే నగరపాలక సంస్థలు చెత్త ఊడ్చడానికి ఖరీదైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే భారీగా డబ్బులు కావాలి. అందువల్లే అవి అద్దె ప్రాతిపదికన తీసుకొస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటికి చెల్లించే అదే భారీగా ఉంటున్నది. వాస్తవానికి ఆ స్థాయిలో చెల్లించే అద్దె ద్వారా కొత్త యంత్రాలు కొనుగోలు చేయవచ్చు. కానీ నగరపాలక సంస్థల్లో వ్యవహారం వేరే విధంగా ఉంటుంది కాబట్టి వందల కోట్లలో అద్దె చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు.మనదేశంలో ప్రఖ్యాత నగరపాలక సంస్థల్లో బెంగళూరు ఒకటి. బెంగళూరు నగరం మనదేశ ఐటీ రాజధానిగా పేరుపొందింది. ఇక్కడ అనేక బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంతో పోల్చి చూస్తే బెంగళూరు నగరం కూడా విపరీతంగా పెరిగింది. పెరిగిన నగరానికి తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ మీద పడింది. వాస్తవానికి బెంగళూరులో రోడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇక సాయంత్రం పూట ట్రాఫిక్ చెప్పాల్సిన పనిలేదు. వర్షం కురిస్తే మాత్రం నరకం కనిపిస్తుంది. బెంగళూరులో ప్రతిరోజు చెత్త భారీగా పోగుపడుతుంది. ఇలా పోగు పడిన చెత్తను శుభ్రం చేయాలంటే కార్మికులకు తలకు మించిన భారమవుతోంది. ఏటికేడు ఈ సమస్య పెరిగిపోతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం 613 కోట్ల విలువైనది. ఇంతటి డబ్బు పెట్టి కొత్త యంత్రాలు కొనుగోలు చేస్తున్నారనుకుంటే పొరపాటే.బెంగళూరు నగరపాలక పరిధిలో చెత్తను శుభ్రం చేయడానికి.. రోడ్లను ఊడ్చడానికి ఏకంగా 46 స్వీపింగ్ యంత్రాలను బెంగళూరు నగరపాలక సంస్థ అధికారులు అద్దెకు తీసుకున్నారు.

ఏడు సంవత్సరాలపాటు ఈ యంత్రాలను వాడుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి కర్ణాటక రాజధాని అయిన బెంగళూరు నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమైనప్పటికీ.. ఇంతటి ఖర్చుపెట్టి.. అది కూడా యంత్రాలను అద్దెకు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇలాంటివి సహజమేనని వ్యాఖ్యానిస్తున్నారు.


## శభాష్ టీచర్

**- కుటుంబ కలహాలతో నిరాశ్రయులైన విద్యార్థికి, తల్లికి సాయం**
**- ఉపాధ్యాయులకు కేరళ విద్యాశాఖ మంత్రి ప్రశంస**




న్యూఢిల్లీ: కేరళ ఉపాధ్యాయులు పిల్లలకు అక్షరాలు నేర్పించడమే కాదు.. వారికి అండగా నిలబడుతున్నారు. కుటుంబ కలహాలతో ఇంటిలోకి అనుమతించకపోవడంతో నిరాశ్రయులైన ఆరో తరగతి విద్యార్థి, ఆయన తల్లికి సహాయం చేసి, భద్రత కల్పించిన ఉపాధ్యాయులను కేరళ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి ప్రశంసించారు. ఎర్నాకుళం జిల్లా తిరుమరడిలో ప్రభుత్వం పాఠశాల తరగతి గదిలో అనేక ప్లాస్టిక్ శీతల పానీయాల సీసాలు వదిలేసినట్లు ఉపాధ్యాయులు కనుగొన్న తరువాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రతిరోజూ జ్యూస్ బాటిల్ కొనే విద్యార్థి, ఆ బాటిళ్లను వదిలి వెళ్లేవాడని విచారణలో తేలింది. కౌన్సెలింగ్ సమయంలో ఆ విద్యార్థి తన తల్లి రోజూ ఇచ్చే రూ.20తో బతికేవాడినని, ఇంట్లో తనకు ఆహారం దొరకడం లేదని ఉపాధ్యాయులకు చెప్పాడు. తదుపరి విచారణలో విద్యార్థి తల్లిదండ్రుల మధ్య వివాదం జరిగిందని, ఆయన నాన్నమ్మ చాలా రోజులుగా తల్లిని, బిడ్డను ఇంట్లోకి రానివ్వటం లేదని తేలింది. కొన్ని రోజులుగా ఆ పిల్లవాడు, ఆయన తల్లి ఇంటి బయట గుబురుగా ఉన్న ప్రాంతంలో తాత్కాలిక షెడ్డులో నివసిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు చైల్డ్‌లైన్, పోలీసుల సహాయంతో తల్లిదండ్రులు, అత్తమామలతో మాట్లాడి అన్ని సమస్యలను పరిష్కరించారు. ఆ విద్యార్థిని, ఆయన తల్లిని ఇటీవల తండ్రి, నాన్నమ్మ తిరిగి ఇంట్లోకి అనుమతించారు. తిరుమరడిలోని ఉపాధ్యాయులు మానవత్వానికి ఆదర్శప్రాయమైన నమూనాను ప్రదర్శించారని విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి అన్నారు. 'ఈ ఘటన మన ప్రభుత్వ విద్యాసంస్థలు విద్యార్థుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడంలో ఎంత నిబద్ధతతో ఉన్నాయో చూపిస్తోందని, పాఠ్యాంశాల పరిమితులను దాటి చాలా దూరం వెళ్తుంది. కౌన్సెలింగ్ సమయంలో ఆరో తరగతి విద్యార్థి ఎదుర్కొంటున్న బాధను గుర్తించడం అభినందనీయం. ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు సకాలంలో జోక్యం చేసుకోవడంతో ఆ బిడ్డ, తల్లి ఇంటికి తిరిగి వెళ్లడానికి సురక్షితమైన వాతావరణం ఏర్పడింది' అని అన్నారు. 'ప్రతి విద్యార్థి సురక్షితంగా ఉండేలా చూసేందుకు రాత్రింబవళ్లు అవిశ్రాంతంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వ విద్యాశాఖ తరపున నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు కేవలం అక్షరాలు నేర్పించడం మాత్రమే కాదు. మీరు వారి జీవితాల్లో ప్రేమ, కరుణ వంటి గొప్ప పాఠాలను బోధిస్తున్నారు' అని పేర్కొన్నారు. సమస్య పరిష్కారమైన తరువాత తల్లీబిడ్డ తమ కృతజ్ఞతలు తెలియజేయడానికి పాఠశాలకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు, తరగతి ఉపాధ్యాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు ఆ చిన్నారి ఇంటికి వెళ్లి తమ మద్దతును అందించారు.

## బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు



విజయవాడ, : ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏపీ సీఎం మాట్లాడుతున్నంతసేపు తన చప్పట్లతో ప్రోత్సాహం అందిస్తూ వచ్చారు. అలాగని ఆయన ఏదో ఒక డమ్మీ కేంద్రమంత్రి కాదు. అక్షరాల ప్రధాని నరేంద్ర మోడీ కోర్ టీం లో ఉన్న నేత.2018లో ఎన్డీఏనుంచి దూరమయ్యారు చంద్రబాబు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేసిన ఆయన.. ఉన్నఫలంగా కేంద్ర ప్రభుత్వానికి దూరమయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రాప్ లో పడ్డారు. ఆ సమయంలో కేంద్ర పెద్దలతో ఢీ కొట్టినంత పని చేశారు. అప్పుడే ఏపీలో చంద్రబాబు పని పట్టాలని కేంద్ర పెద్దలు నిర్ణయించుకున్నారు. కేంద్రానికి చెందిన ప్రత్యేక టీం ఏపీలో పనిచేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం వెనుక బిజెపి వ్యూహాలు ఉన్నట్లు అప్పట్లో టిడిపి అనుమానించింది. అయితే 2019 నుంచి 2024 మధ్య ప్రతి పరిణామాన్ని గుణపాఠంగా మార్చుకుంది టిడిపి. తన తప్పు తెలుసుకున్న చంద్రబాబు కేంద్ర పెద్దలతో సఖ్యత ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర పెద్దలు చంద్రబాబును నమ్మడం లేదన్న ప్రచారానికి చెక్ చెబుతూ.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు అభినందనలతో ముంచెత్తడం విశేషం.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో.. సిఐఐ నేతృత్వంలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరిగింది. దాదాపు 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అయితే కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోంది అని ఈ పెట్టుబడుల సదస్సుతో తేలిపోయింది. గత కొద్ది రోజులుగా ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయి. భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఏర్పాటు అవుతున్నాయి. తద్వారా ఏపీకి తమ సాయం ఉంటుందని కేంద్రం స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. 2014 నుంచి 2024 వరకు ఏపీ విషయంలో కేంద్రం నుంచి అసంపూర్ణ సహకారం అందేది. కానీ గడిచిన 17 నెలల కాలంలో కేంద్రం వైఖరి చూస్తుంటే ఏపీ పట్ల పూర్తి ఉదారస్వభావం చూపుతున్నట్లు అర్థమవుతోంది. స్వయంగా ప్రధానికి అత్యంత సన్నిహితుడు అయిన పీయూష్ గోయల్ ఏపీ సీఎం చంద్రబాబు పట్ల చూపుతున్న గౌరవం చూస్తుంటే మాత్రం.. బిజెపి పెద్దలకు అత్యంత ఇష్టమైన నాయకుడిగా చంద్రబాబు అవతరించారని అనడంలో ఎటువంటి అతిశయక్తి లేదు.

## పార్కిన్సన్స్ వ్యాధికి అసలు కారణమిదే..



**- ఆస్ట్రేలియా పరిశోధనలో కీలక విషయాల వెల్లడి**
**- మెదడులోని రక్తనాళాల్లో మార్పులే వ్యాధి తీవ్రతకు కారణం**
**- ప్రోటీన్ల కంటే రక్తనాళాల పాత్రే ఎక్కువని గుర్తింపు**
**- ఈ ఆవిష్కరణతో కొత్త చికిత్సలకు మార్గం సుగమం**

పార్కిన్సన్స్ వ్యాధిపై ఇప్పటివరకు ఉన్న అవగాహనను మార్చేసే కీలక ఆవిష్కరణను ఆస్ట్రేలియా పరిశోధకులు కనుగొన్నారు. ఈ వ్యాధి కారణంగా మెదడులోని రక్తనాళాల్లో తీవ్రమైన మార్పులు సంభవిస్తాయని, ఇదే వ్యాధి ముదరడానికి ప్రధాన కారణమని వారు తేల్చారు. ఈ పరిశోధన భవిష్యత్తులో పార్కిన్సన్స్‌కు కొత్త చికిత్సా మార్గాలను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటివరకు పార్కిన్సన్స్‌కు మెదడులో ఆల్ఫా-సిన్యూక్లిన్ అనే ప్రోటీన్ పేరుకుపోవడమే కారణమని భావించేవారు. అయితే, ఆస్ట్రేలియాలోని న్యూరోసైన్స్ రీసెర్చ్ ఆస్ట్రేలియా సంస్థ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ప్రోటీన్ల కంటే మెదడులోని రక్తనాళాల్లో చోటుచేసుకునే మార్పులే వ్యాధి తీవ్రతలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తేలింది. "సంప్రదాయకంగా పరిశోధకులు ప్రోటీన్లు, నరాల కణాల నష్టంపైనే దృష్టి పెట్టారు. కానీ, మేము మెదడులోని రక్తనాళాల వ్యవస్థపై దాని ప్రభావాన్ని చూపించగలిగాం" అని పరిశోధనలో కీలకపాత్ర పోషించిన డెర్యా డిక్ తెలిపారు. తమ అధ్యయనంలో మెదడులోని కొన్ని ప్రాంతాల్లో రక్తనాళాలు బలహీనపడటాన్ని, ముఖ్యంగా పనికిరాని రక్త కేశనాళికల అవశేషాలు (స్ట్రింగ్ వెస్సెల్స్) పెరగడాన్ని గుర్తించినట్లు డెర్యా వివరించారు.

# అమెరికాలో భారీగా తగ్గిన భారత విద్యార్థుల అడ్మిషన్లు!



- వీసా సమస్యలే ప్రధాన కారణమని వెల్లడించిన నివేదిక
- హెచ్-1బీ వీసాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తున్న ట్రంప్ ప్రభుత్వం
- ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న విదేశీ విద్యార్థుల తగ్గుదల
- వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసిన యూఎస్

న్యూఢిల్లీ: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో భారత విద్యార్థుల గ్రాడ్యుయేట్ ప్రవేశాలు 10 శాతం మేర తగ్గాయని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ నిధులతో రూపొందించిన తాజా నివేదిక వెల్లడించింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సోమవారం విడుదల చేసిన "ఓపెన్ డోర్స్" నివేదిక ప్రకారం 2025 ఫాల్ సెషన్‌లో అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు ఏకంగా 17 శాతం తగ్గాయి. సర్వేలో పాల్గొన్న 825 అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో 61 శాతానికి పైగా సంస్థలు భారత విద్యార్థుల నమోదులో క్షీణత కనిపించిందని తెలిపాయి. వీసా దరఖాస్తుల విషయంలో ఎదురవుతున్న సమస్యలు, ప్రయాణ ఆంక్షలే ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలని 96 శాతం యూనివర్సిటీలు అభిప్రాయపడ్డాయి. అయితే, 2024-25లో అమెరికాకు అత్యధిక విదేశీ విద్యార్థులను పంపిన దేశంగా భారత్ ఇప్పటికీ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. మొత్తం విద్యార్థుల సంఖ్యలో 10 శాతం పెరుగుదల ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేట్ కోర్సుల్లో మాత్రం క్షీణత నమోదైంది. ఇటీవలి కాలంలో ట్రంప్ ప్రభుత్వం అంతర్జాతీయ విద్యార్థులపై నిఘా పెంచడం, హెచ్-1బీ వీసాల దుర్వినియోగంపై 170కి పైగా విచారణలు ప్రారంభించడం వంటి చర్యలు ఈ పరిస్థితికి కారణంగా కనిపిస్తున్నాయి. కొత్తగా హెచ్-1బీ దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజును ప్రతిపాదించడాన్ని వైట్ హౌస్ సమర్థించింది. ఈ విధానం ద్వారా అమెరికన్ల ఉద్యోగాలను కాపాడగలమని వైట్ హౌస్ ప్రతినిధి టేలర్ రోజర్స్ తెలిపారు.మరోవైపు, రిపబ్లికన్ చట్టసభ సభ్యులు హెచ్-1బీ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను స్టేట్ డిపార్ట్‌మెంట్ రద్దు చేసింది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు అంతర్జాతీయ విద్యార్థులు ఏటా దాదాపు 55 బిలియన్ డాలర్లను అందిస్తూ, 3.55 లక్షల ఉద్యోగాలకు మద్దతుగా నిలుస్తున్నారని వాణిజ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. తాజా పరిణామాలు ఈ ఆర్థిక వనరులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# డెలివరీ బాయ్స్ స్థానంలో డ్రోన్లు..

## గిగ్ వర్కర్స్‌పై ఏఐ పిడుగు!

## లక్షల మంది వీధిన పడే ప్రమాదం




న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు నిపుణులైన ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా మాత్రమే కాకుండా సాధారణ ఉద్యోగుల ఉసురు తీసేందుకు సైతం సిద్ధమవుతున్నది. అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలలో నిపుణులైన సిబ్బందికి ప్రత్యామ్నాయంగా ఇప్పటికే అనేక రంగాలను ఆక్రమిస్తున్న ఏఐ.. త్వరలో డెలివరీ బాయ్స్ స్థానాన్ని కూడా ఆక్ర మించనున్నది. అమెజాన్, జెప్టో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ సంస్థలు.. మనం ఆర్డర్ చేసిన వస్తువులను 10 నిమిషాల్లో మన ఇంటి ముందుకు తెస్తున్నాయి. ఇందుకోసం ఆయా సంస్థలు డెలివరీ బాయ్స్‌ను వినియోగిస్తున్నాయి. కాగా.. ఈ డెలివరీ బాయ్స్ స్థానాన్ని త్వరలో డ్రోన్లు ఆక్రమించనున్నాయి. ఇదే జరిగితే ఈ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కొన్ని లక్షల మంది వీధిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే గుర్గావ్, బెంగళూరు వంటి నగరాల్లో వస్తువుల బట్వాడాకు పలు సంస్థలు డ్రోన్లనే వినియోగిస్తున్నాయి. ఉద్యోగులతో పోల్చుకుంటే అత్యంత వేగంగా, అతి తక్కువ ఖర్చుతో డ్రోన్లు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ అమెరికాలోని తన గోదాములలో ఇప్పటికే ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో ఏఐతో పనిచేసే రోబోలను ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ యాంత్రీకరణకు మద్దతునిస్తున్నాయి.

ఉద్యోగ భద్రత లేదు..: డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్న వారికి ఇప్పటికే ఎటువంటి ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు, పీఎఫ్ సదుపాయం లేదు. పని మానేసిన రోజున ఎటువంటి బెనిఫి ట్స్ చేతికందవు. రోజుకు12నుంచి 15 గంటలు పని చేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదు. ఒక్కరోజు పనికి వెళ్లకపోతే.. ఆ రోజుకు ఎటువంటి భత్యం అందదు. ప్రభుత్వ పథకాలు తెలియవు: దేశంలో కోటిమం దికిపైగా ఉన్న గిగ్ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని సదుపాయాలను ప్రకటించింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సూచి ంచింది. అలా నమోదైన వారికి ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన సదుపాయాలను కల్పిస్తామని తెలిపింది. అయితే వీటి గురించి చాలామంది గిగ్ వర్కర్లకు తెలియదని గిగ్ వర్కర్స్ యూనియన్ సమన్వయకర్త నిర్మల్ గౌరానా చెప్పారు. వారు తమ రోజువారీ ఉపాధిపైనే దృష్టి కేంద్రీకరిస్తారని ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలియదని అన్నారు. వారు పనిచేస్తున్న కంపెనీ వారిని రోడ్డున పడేస్తే,పరిహారం అడిగే హక్కు కూడా వారికి లేదని చెప్పారు.

# చంద్రయాన్ 3 దిశగా అడుగులు


## 2027లో గగన్ యాన్

బెంగళూరు, : చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్ తీసుకువచ్చేందుకు 2028లో చంద్రయాన్-4 మిషన్ ను చేపట్టనున్నట్టు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. 2035 నాటికి భారత్ సొంత స్పేస్ స్టేషన్‌ను కూడా నిర్మించుకోనుందని ప్రకటించారు. 2027లో చేపట్టే గగన్ యాన్ మానవ సహిత అంతరిక్ష యాత్ర షెడ్యూల్- లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 7 రాకెట్ ప్రయోగాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది చేపట్టే ప్రయోగాల్లో పూర్తి స్వదేశీ పరికరాలతో రూపొందించిన పీఎస్ఎల్వీ రాకెట్, ఒక కమర్షియల్ కమ్యూనికేషన్ శాటిలైట్ మిషన్, మరికొన్ని పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మిషన్లు కూడా ఉన్నాయని తెలిపారు. చంద్రయాన్-4 మిషన్ కు కేంద్రం ఆమోదం తెలిపిందని, ఇది ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన మిషన్‌గా నిలుస్తుందన్నారు. 2028లో ఈ మిషన్?ను చేపడతామన్నారు. ప్రస్తుతం చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్‌ను తీసుకురాగలిగే సత్తా అమెరికా, రష్యా, చైనాకే ఉందని, ఈ మిషన్ సక్సెస్ అయితే భారత్ వాటి సరసన చేరుతుందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై వాటర్ ఐస్‌పై అధ్యయనం కోసం జపాన్ ఏరోస్పేస్ ఎక్స్ ప్లొరేషన్ ఏజెన్సీతో కలిసి 'లూపెక్స్' మిషన్ కూడా చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా, తదితర దేశాల నేతృత్వంలోని ఐఎస్ఎస్, చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయని, భారత్ కూడా 2035 నాటికి సొంత స్పేస్ స్టేషన్ ను ఏర్పాటు చేసుకోనుందని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే పనులను ప్రారంభించామన్నారు. 2028 నాటికల్లా తొలి 5 మాడ్యూల్స్?ను కక్ష్యలోకి చేరుస్తామన్నారు. మానవ సహిత మిషన్ చేపట్టడానికి ముందు నిర్వహించే మానవ రహిత మిషన్ల షెడ్యూల్‌ను మాత్రమే మార్చామన్నారు. వీటిని ఈ ఏడాదిలోనే పూర్తి చేస్తామని, షెడ్యూల్ ప్రకారం 2027లో మానవ సహిత మిషన్ ఉంటుందన్నారు. 2040 నాటికి చంద్రుడిపైకి భారత ఆస్ట్రోనాట్లను పంపే దిశగా పని చేయాలని ప్రధాని మోదీ ఇస్రోకు సూచించారని




తెలిపారు.గ్లోబల్ స్పేస్ ఎకానమిలో ఇండియాకు ప్రస్తుతం 2 శాతం వాటా (8.2 బిలియన్ డాలర్లు) ఉందని, 2030 నాటికి దీనిని 8 శాతం(44 బిలియన్ డాలర్లు)కు పెంచాలని టార్గెట్ పెట్టుకున్నట్టు నారాయణన్ తెలిపారు. ప్రస్తుతం గ్లోబల్ స్పేస్ ఎకానమీ 630 బిలియన్ డాలర్ల మేరకు ఉందని, 2035 నాటికి ఇది 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. దేశంలో కొన్నేండ్ల క్రితం స్పేస్ సెక్టార్ లో కేవలం 3 స్టార్టప్ లే ఉండేవని, కేంద్రం 2020లో తెచ్చిన సంస్కరణల ఫలితంగా 450 ఇండస్ట్రీలు, 330 స్టార్టప్ లు ఇప్పుడు యాక్టివ్ గా పని చేస్తున్నాయన్నారు. డిమాండ్ కు తగ్గట్టుగా వచ్చే మూడేండ్లలో స్పేస్ క్రాఫ్ట్ ల ఉత్పత్తిని కూడా మూడు రెట్లకు పెంచుతామన్నారు.

# పర్యాటకం పగటి కలేనా?



నిర్మల్: కాశ్మీర్ వెళ్లే పనిలేదు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణులను చుట్టి వస్తే చాలు.! అంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు పాలకులు ఇస్తున్న హామీలు పగటి కలలుగానే మిగిలిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే సమైక్య ఆంధ్రప్రదేశ్ సహా పక్కనే ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, కర్ణాటక రాష్ట్రాలకు ఒక గొప్ప అనుభూతిని ఇచ్చే పర్యాటక జిల్లాగా పేరు ఉంది. ఉన్న పర్యాటక కేంద్రాలను కాస్త అభివృద్ధి చేస్తే దేశంలోనే గొప్ప పర్యాటక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కీర్తి వస్తుంది. కానీ, పాలకులు ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాక ఎన్నికల సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నా అవికార్యరూపం దాల్చడం లేదు. దీంతో ప్రభుత్వాలు, పాలకులపై జిల్లావాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నెన్నో అందాలు...: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవుల ఖిల్లాగా పేరు ఉంది. 60శాతం పైగా అడవులు విస్తరించి ఉన్న జిల్లా కావడంతోపాటు అనేక జలపాతాలు, సెలయేరులు జిల్లాలో విస్తరించి ఉన్నాయి. దీనికి తోడు అనేక చారిత్రాత్మక ప్రదేశాలు కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉండడం విశేషం. అంతటి మహోన్నత ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దే విషయంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయడంలో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆదిమ గిరిజన ఆరాధ్య దైవం కొమురం భీమ్ జన్మించిన జోడెన్ ఘాట్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా ఆచరణకు నోచుకోలేదు. మ్యూజియం పనులు మినహా ఇతర అభివృద్ధి పనులు జరగడం లేదు. ఆ ప్రాంతానికి ఉట్నూరు లేదా ఆసిఫాబాద్ మీదుగా కెరామెరి ఘాట్స్ మీదుగా వెళ్తే కాశ్మీర్ వెళ్లినట్లే. అలాగే ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు కనువిందు చేస్తాయి. జైనాథ్ సూర్య దేవాలయం, నాగోబా ఆలయం, ఉట్నూర్ గోండుల జిల్లా, సిర్పూర్ పేపర్ మిల్లు, సింగరేణి కోల్ మైన్స్, బాసర అమ్మవారి క్షేత్రం, నిర్మల్ కొయ్య బొమ్మలు, కడెం కవ్వాల్ అభయారణ్యం ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కనీసం 20కి పైగా మంచి పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వీటిని తీర్చిదిదితే కనీసం మూడు నుంచి నాలుగు రోజులపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటకులు గడపడంతోపాటు, మంచి అనుభూతిని పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా ఉమ్మడి జిల్లాలో పర్యాటకం పడకేస్తున్నది. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి రూ.100కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అది ఉట్టిదేనని తేలిపోయింది.

ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. గతంలో మాదిరిగా కాకుండా తాము కచ్చితంగా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన 10మంది ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు రాజకీయాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్చార్జి మంత్రి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి నిధుల మంజూరుకు ఒత్తిడి చేస్తే కచ్చితంగా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# హిందూపురంలో ఏం జరుగుతోంది..?




అనంతపురం, :హిందూపురం వైసీపీ ఇంచార్జ్ దీపికా రెడ్డి భర్త వేణు రెడ్డి కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఆయన బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారనిఈ దాడి చేశారు. ఎవరో హైదరాబాద్ లో ఉండే వాడి కాళ్ల కింద బతుకుతున్నాం.. వారికి ఓట్లు వేస్తాం, వారు హైదారబాద్‌లో కూర్చుంటాడు. మనం ఇక్కడ బానిస బతుకులు బతుకుతున్నాం... అని ఆయన వ్యాఖ్యానించారు. వేణురెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేసి.. ఆయన కార్యాలయంపై దాడి చేశారు. వేణు రెడ్డి భార్య దీపికారెడ్డి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు తమ కార్యాలయంపై దాడి చేశారని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై టీడీపీ నాయకులు , బాలకృష్ణ అనుచరులు చేసిన హింసాత్మక దాడి ప్రజాస్వామ్యంపైనే ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఫర్నిచర్ పగలగొట్టడం, గాజు అద్దాలను పగలగొట్టడం, కార్యకర్తలపై భౌతికంగా దాడి చేయడం ప్రజాస్వామ్య నిబంధనల ప్రమాదకరమైన పతనాన్ని సూచిస్తుందని జగన్ అన్నారు. పోలీసులు పట్టించుకోకపోవడం మరింత ఆందోళనకరంగా ఉందన్నారు.చంద్రబాబు నాయుడు రాజకీయ ఎజెండా కోసం ఆంధ్రప్రదేశ్ శాంతిభద్రతల యంత్రాంగాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారనే దానికి ఇది సూచికన్నారు. హిందూపురంలో టీడీపీ అల్లరిమూకలను ఎలా ప్రోత్సహిస్తున్నారో.. అల్లర్ల ద్వారా రాజకీయ వ్యతిరేకతను అణిచివేయడానికి ప్రయత్నిస్తుందో స్పష్టంగా చూపిస్తుందన్నారు. తన ప్రత్యర్థుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను రక్షించలేని ప్రభుత్వానికి పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది వైసీపీ పై మాత్రమే కాదు, ప్రజాస్వామ్యం, రాజకీయ స్వేచ్ఛను విశ్వసించే ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు .బాలకృష్ణ ఎక్కువగా నియోజకవర్గంలో ఉండరని ప్రచారం చేస్తూ.. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోనే దాడులు చేసినట్లుగా టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై ఇంకా బాలకృష్ణ స్పందించలేదు. తెరపైకి లోకల్ అస్త్రం: హిందూపురంలో లోకల్ నినాదం తేవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి గెలుపొందుతూ వస్తోంది. ఇక్కడ టిడిపిని మట్టి కరిపించాలని ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. ఈ నియోజకవర్గంలో టిడిపికి బలమైన పునాది ఉంది. దీని వెనుక నందమూరి కుటుంబం కృషి ఉంది. ఈ నియోజకవర్గ నుంచి నందమూరి తారక రామారావు ప్రాతినిధ్యం వహించారు. అటు తరువాత హరికృష్ణ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇదే నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించారు నందమూరి బాలకృష్ణ. ఎన్నెన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నా విపక్షాలకు హిందూపురం నియోజకవర్గం చిక్కలేదు. 2024 ఎన్నికల్లో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఇప్పుడు వైసీపీ లోకల్ నినాదం తేవాలన్న ప్రయత్నంలో ఉన్నట్టు కనిపిస్తోంది.చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే రాజకీయాల్లో కూడా రాణిస్తున్నారు బాలకృష్ణ. హిందూపురం శాసనసభ్యుడిగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించిన ఆయన సినిమాలను కూడా కొనసాగిస్తున్నారు. అయితే నియోజకవర్గ విషయంలో మాత్రం ప్రత్యేక దృష్టితో ఉంటారు. ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి తప్పకుండా పర్యటనలు చేస్తారు. మరోవైపు ఇటీవల బాలకృష్ణ సతీమణి వసుంధర సైతం ఎక్కువగా నియోజకవర్గానికి వస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. అటువంటి నియోజకవర్గంలో బాలకృష్ణ హవా చూస్తున్న ప్రత్యర్థులు హడలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా నందమూరి బాలకృష్ణ పై హిందూపురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ వేణు రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై టిడిపి శ్రేణులు దాడి చేసే దాకా పరిస్థితి వచ్చింది.గత ఎన్నికల్లో దీపిక రెడ్డి అనే మహిళ నేతను రంగంలోకి దించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. చాలా సమీకరణలను వడబోసి దీపిక రెడ్డి సరిపోతారని భావించి ఆమెను పోటీలో పెట్టారు. అయితే ఆమె కనీసం బాలకృష్ణ కు పోటీ ఇవ్వలేకపోయారు. అయితే ఇప్పుడు తాజాగా నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉన్న వేణు రెడ్డి మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. హైదరాబాదు నుంచి ఎవడో ఏలుతున్నాడని..

ఇంకెన్నాళ్లు ఈ బానిస బతుకులు అంటూ చేసిన వ్యాఖ్యలు టిడిపి శ్రేణులను ఆగ్రహం తెప్పించాయి. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై దాడి జరిగింది. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి సైతం ఇంగ్లీషులో ట్వీట్ చేశారు. టిడిపిని రెచ్చగొట్టి.. శాంతిభద్రతల విఘాతంతో పాటు తప్పుడు ప్రచారం చేసేందుకు దీనిని ఒక ప్రయత్నం గా మలుచుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల్లో బాలకృష్ణను ఓడించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదు.

ఈ క్రమంలో అనేక ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకున్నారు. 2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ ఓడించేందుకు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం బాలకృష్ణ గెలిచేసరికి వైసిపి కి మైండ్ బ్లాక్ అయింది. అందుకే 2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ గెలవకూడదని జగన్ భావించారు. ఆ బాధ్యతను సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు. ఆయన తన సొంత నియోజకవర్గ పుంగనూరును కాదని హిందూపురంపై ఎక్కువగా దృష్టి పెట్టారు. అయినా సరే ఫలితం లేకపోయింది. అయితే ఇప్పుడు బాలకృష్ణ పై తప్పుడు ప్రచారాలకు వైసీపీ దిగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదంతా రెచ్చగొట్టడంలో భాగమేనని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# ఇక రైల్వే స్టేషన్లలో కేఎఫ్‌సీ, మెక్ డొనాల్డ్స్

## బ్రాండెడ్ ఫుడ్ ఔట్‌లెట్లకు అనుమతి




న్యూఢిల్లీ: మెక్ డొనాల్డ్స్, కేఎఫ్‌సీ, పిజ్జా హట్, బాస్కిన్ రాబిన్స్, బికనేర్‌వాలా, హల్దీరామ్స్ వంటి మేజర్ ఫుడ్ చెయిన్స్ ఇక రైల్వే స్టేషన్లలో కొలువుతీరనున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఈ ఫుడ్ కోర్టులు వెలిసేందుకు రంగం సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. రైల్వే బోర్డుకు చెందిన క్యాటరింగ్ పాలసీలో సంస్కరణలకు శ్రీకారం జరిగింది. 2025 నవంబర్ 13నజారీచేసిన సర్క్యులర్‌లో రైల్వే బోర్డు ఈ మేరకు జోనల్ అధికారులకు ఆదేశాలిస్తూ డిమాండు, స్థలం అవసరాల మేరకు ప్రముఖ సింగిల్‌బ్రాండ్ ఫుడ్ ఔట్‌లెట్లను త్వరితంగా అనుమతించాలని పేర్కొంది. ఇవి కంపెనీ ఆధ్వర్యంలో లేదా ఫ్రాంచైజెస్ ద్వారా నిర్వహించాలని, అయితే ఎంపిక మాత్రం ప్రస్తుతం ఉన్న ఈ-వేలం విధానం ద్వారా మాత్రమే ఉండాలని పేర్కొంది.

### ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల భద్రత..

# సురక్షిత ప్రయాణం మొదటి ప్రాధాన్యత

**పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**



గోదావరిఖని:వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేలా, రోడ్డు ప్రమాద రహిత ప్రాంతంగా మార్చాలానే సదుద్దేశంతో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా రాత్రి వేళల్లో వాహన రాకపోకలు తగ్గించాలని, రోడ్ల పక్కన వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో రాత్రి సమయంలో ఆలస్యంగా, తెల్లవారుజామున వాహనాల ప్రయాణం కారణంగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో రామగుండం పోలీస్ కమీషనరేట్ ట్రాఫిక్ పోలీసు శాఖ మరియు లా అండ్ ఆర్డర్ పోలీస్ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. నిద్రమత్తు, మద్యం సేవించి డ్రైవింగ్, మితిమీరిన అతివేగం వంటి ఇతర కారణాలతో రాత్రి, తెల్లవారుజామున సమయంలో ఎక్కువ ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, రాత్రి 11 గంటల తరువాత అవసరం లేని, ప్రయాణాలు చేయకుండా, అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేసేలా ఉండాలని ప్రజలను సీపీ విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో రోడ్ల పక్కకు వాహనాలను నిర్లక్ష్యంగా పార్క్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువ కావున రోడ్లు, హైవేలు, జంక్షన్లు, సర్వీస్ రోడ్లపై బాధ్యత రాహిత్యంగా పార్క్ చేసిన వాహానాలపై ట్రాఫిక్ మరియు లా - ఆర్డర్ పోలీస్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప రాత్రి ఆలస్యంగా ప్రయాణాలు చేయడం మానుకో వాలని సూచించారు రోడ్ల పక్కన,
నేషనల్ హైవేలు, జంక్షన్లు మరియు సర్వీస్ రోడ్లపై వాహనాలను పార్క్ చేయకూడదు.వాహనం లో సాంకేతిక లోపం కారణంగా నిలిపివేయాల్సి వస్తే వెంటనే హెచ్చరిక లైట్లు ఆన్ చేసి, సహాయం కోసం హెల్ప్ లైన్‌ను సంప్రదించాలని సూచించారు.ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ, భద్రత మొదటి ప్రాధాన్యత అని రాత్రి వేళల్లో పర్యవేక్షణ, విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ విధులు, ట్రాఫిక్ ఎన్ఫోర్స్‌మెంట్ మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు సీపీ తెలిపారు.

# నిప్పు... సద్దుల్లో నిజమెక్కడ...?




హైదరాబాద్: తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనయ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో హరీశ్ రావు, కవిత మధ్య వార్ మరోసారి చర్చనీయాంశమైంది. తెలంగాణ రాజకీయాలను వేడెక్కించింది. కవిత మెదక్‌లో చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. తెలంగాణను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ అని.. కానీ కవిత కారణంగానే పార్టీ నష్టపోయిందని బీఆర్ఎస్ నేత మల్లికార్జునగౌడ్ సంచలన ఆరోపణ చేశారు. కవిత అక్రమ సంపాదనపై నిగ్రహం లేకుండా వ్యవహరించడంతో, 'కుటుంబ పాలన' ముద్రను బీఆర్ఎస్ తొలగించవలసిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కవిత వ్యవహారమే పార్టీని భ్రష్టు పట్టిందని ఆరోపించడం ఇప్పటి రాజకీయ దృశ్యాన్ని కలవరపరిచింది. తన మాటల్లో 'పార్టీలో అవినీతిని కవిత నవీకరించిందని, హరీశ్‌రావుపై కూడా ఆరోపణలు చేయడం ద్వారా కుటుంబంలోనే విభేదాలు పెరిగాయా?' అన్న సందేహం మిగిలింది.బీఆర్ఎస్ ప్రెస్‌మీట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు విమర్శలతో విరుచుకుపడుతున్నారు. "పార్టీలోనే దొంగలు ఉన్నారు", "హరీశ్ రెంటు నుంచి కోట్లకు వెళ్లాడు", "అదే నోరు అప్పటి ఆరోపణలకు ఉండలేదా?" వంటి ప్రశ్నలు వేస్తున్నారు. 'లిక్కర్ స్కాం నిజమైతే గత ధర్నాలు, నిప్పు?సద్దుల్లో నిజమెక్కడ?' అనే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవి పార్టీ నైతికతను ప్రశ్నిస్తున్నాయి.
పార్టీలో ఉన్నప్పుడు పూజలు, బైటకు వెళితే నిందలా అని నిలదీస్తున్నారు. కార్టూను స్టైల్‌లో "సారు+కారు= ఇక రారు" మీమ్స్ పోస్టు చేస్తున్నారు.బీఆర్ఎస్ ముఖ్య నాయ్యకత్వంపై లిక్కర్ స్కాం జరగలేదని ఆరోపించారు. కానీ ఇప్పుడు కవిత విషయంలో స్కాం జరిగిందని, కవిత స్కాం చేసిందని ధ్రువీకరిస్తున్నారు. అందుకే పార్టీ నాశనం అయిందని, పేర్కొంటున్నారు. కుటుంబ పాలనపై ప్రతిపక్ష విమర్శలకు కవిత వ్యవహారమే బలంగా మారింది.

# రూపాయి ఎందుకు క్షీణిస్తోంది?

డాలర్ పడిపోతున్న తరుణంలో ఆ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోవడం అంటే ఆర్థిక దారుణమేనా? డాలర్ బలంగా ఉండి అన్ని దేశాల కరెన్సీలు పడిపోతున్నాయి, ఆ క్రమంలో మన రూపాయి కూడా పడిపోతోందని అనుకున్నా ఒక అర్థం ఉంది.కానీ డాలర్ పతనం అవుతున్నా, మన రూపాయి విలువ పెరగక పోవడాన్ని ఏ విధంగా చూడాలి? అన్నదే చర్చగా ఉంది. అసలు ఈ విలువ పతనానికి కారణాలు విశ్లేషించడానికి ఆర్థిక నిపుణులకు ధైర్యం చాలడం లేదు. యూపీఏ హయాంలో మన్మోహన్ వంటి ఆర్థిక నిపుణుడు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో.. రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంకును రంగంలోకి దింపి విదేశీ కరెన్సీ విక్రయాలు చేసి రూపాయిని కాస్త బలం పుంజుకునేలా చేశారు. కనీసం పడిపోకుండా ఆపే ప్రయత్నం చేశారు. కానీ ప్రస్తుతం అలాంటి విధానాలను పట్టించుకోవడం లేదు. రూపాయి పతనం ఎంతో మంది జీవితాలపై వ్యాపారాలపై ప్రభావం చూపిస్తోంది. పాలకుల వద్ద దీనికి పరిష్కారం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థైర్యాన్ని కొలిచే కీలక సూచీలో ఒకటి కరెన్సీ విలువ. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్ల ఒత్తిడికి, దేశీయ విధాన పరమైన వైఫల్యాలకు, రాజకీయ–ఆర్థిక అనిశ్చితులకు రూపాయి బలి అవుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. మొన్న రూపాయి విలువ భారీగా పతనం అయింది. డాలర్‌తో పోలిస్తే 90 రూపాయలు క్షీణించి ఆల్ టైం రికార్డ్‌గా నమోదైంది. ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. అయినా మన పాలకులు రూపాయి ఎందుకు పడిపోయిందో గుర్తించి కట్టడి చేయాలని ఎందుకు అనుకోరు? విదేశీ మదుపుదారులు స్టాక్, రుణ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుం టున్నారు. వాటిని ఇతర చోట్లకు తరలిస్తున్నారు. వారంతా డాలర్ల రూపంలోనే లావాదేవీలు చేస్తారు కాబట్టి డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి విలువ తగ్గుతోంది. ట్రంప్ బెది రింపులు, వాణిజ్య పోరు వంటి అనేక సమస్యలు కూడా పలు దేశాల కరెన్సీల విలువ పతనానికి కారణం అవు తున్నాయి. మనపైనా అదే ప్రభావం చూపిస్తోంది. రూపాయి పతనాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బీఐ చెబుతున్నప్పటికీ అవన్నీ ఉత్తుత్తి ప్రయత్నాలే.. గతంలో రూపాయి పతనం అయిన ప్రతీసారి రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగి ఫారిన్ ఎక్స్ఛేంజ్‌ని మార్కెట్‌లో రిలీజ్ చేసి రూపాయి విలువ పతనం కాకుండా కాపాడేది. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆర్‌బీఐ మార్కెట్‌లో ఫారిన్ ఎక్స్ఛేంజ్‌గా విడుదల చేసే మొత్తం 11 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఆర్బీఐ విధానాన్ని పరోక్షంగా ప్రభుత్వ విధానంగా చెప్పుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్బీఐ దగ్గర 684 బిలియన్ డాలర్ల ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. అయినా ఆర్‌బీఐ ఇప్పుడు జోక్యం చేసుకోవడం లేదు. ఈ రూపాయి విలువ పతనంలో ఆర్‌బీఐ చర్యలు తీసుకోలేక చేతులు ఎత్తేసింది. ఈ ఏడాది అక్టోబర్ 27తో పోలిస్తే ఇండియన్ రూపీ 3.5 శాతం పడిపోయింది. రూపాయి పతనం చెందుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం రివర్స్‌లో ఆలోచిస్తుంది. నిర్మలా సీతా రామన్ రూపాయి బలహీనపడడం కాదు, డాలరే బలహీన పడుతుందని ప్రకటించారు. పైగా మన దేశ ఎకానమీ ఫండమెంటల్స్ బలంగా బాగానే ఉన్నాయి. గ్లోబల్ పరిస్థితుల వలన రూపాయి పడిపోతున్నదని వాదిస్తున్నారు. అదే నిజమైతే గ్లోబల్ గానే డాలర్ పరిస్థితి బాగా లేదు. డాలర్ కూడా పతనం చెందుతుంది. మరి ఇలాంటి సందర్భంలో మన రూపాయి విలువ ఎందుకు పడిపోతుందో చెప్పకుండా దాట వేస్తున్నారు. డాలర్‌తో పోల్చినప్పుడు ఇతర దేశాల కరెన్సీ పెరుగుతుంటే, డాలర్ తగ్గుతుంటే ఇండియా రూపాయి మాత్రం ఎందుకు తగ్గుతోంది? దీనిని ప్రభుత్వం ఎందుకు ప్రస్తావించడం లేదు. ఎగుమతులు చేస్తే డాలర్లు వస్తాయి. దిగుమతుల వల్ల డాలర్లు రావు, డాలర్స్ సంపాదిస్తున్న దానికి ఖర్చు పెడుతున్న దానికి ఇన్ బ్యాలెన్స్ వల్లన డిమాండ్ సప్లై మిస్ మ్యాచ్ అయ్యి రూపాయి పతనం చెందుతుంది. ఈ అసమతుల్యత వల్ల కూడా రూపాయి పతనం అవుతోంది. డాలర్ విలువ పెరుగుతున్న ప్రతిసారీ, భారత్ చెల్లించాల్సిన ఇంధన బిల్లులు అమాంతం పెరుగుతాయి. దాని ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో ప్రజల జేబులకు నేరుగా తాకుతుంది. ట్రాన్స్‌పోర్టు ఖర్చు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం మరింత ముదురుతుంది. కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు అన్ని రంగాల ధరలు పైకెక్కుతాయి. రూపాయి పతనం ఒక సంఖ్య మార్పు కాదు. దేశ ప్రజల మీద అదనపు భారం పడుతుంది. రూపాయి పతనం ఎంతో మంది జీవితాలపై వ్యాపా రాలపై ప్రభావం చూపిస్తోంది. సామాన్యులకు జేబు గుల్ల అవుతుంది. దిగుమతుల మీద ఆధారపడిన వస్తువుల ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయి. దానివల్ల వాటి రేట్లు పెంచాల్సి వస్తుంది. రూపాయి పతనం వలన ద్రవ్యోల్బణం, దాంతో ధరల పెరుగుదలకు దారితీస్తుంది కొనుగోలు శక్తి తగ్గుతుం ది. బలహీనమైన రూపాయి కారణంగా దిగు మతులు మరింత ఖరీదుగా మారుతున్నాయి. ఆ స్థాయిలో ఎగుమతులు లేకపోవడంతో లోటు భారీగా పెరుగుతోంది. దీనికితోడు ఉపాధి అవకాశాలు కుదించుకుపోవడం, తలసరి ఆదాయం పెరగకపోవడం, జీవన ప్రమాణాలు పడిపోవడం వంటి మోడీ ప్రభుత్వ విధానాల ఫలితాలు కూడా దేశీయ ఆర్థిక రంగాన్ని మరింత సంక్షోభం వైపు నెడుతున్నాయి.

# వైసీపీ ఉక్కు రాజకీయం




విశాఖపట్టణం, : ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ " విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ " అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు –విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు "పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి" గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ క టమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమించడానికి విపక్ష వైసిపికి ఇది అద్భుతమైన అవకాశమని ఎనలిస్టులు చెప్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు వారు చెప్పినట్టుగానే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నెమ్మదించింది. ప్రవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోకపోయినప్పటికీ దానిపై ముందుకు క డా వెళ్లలేదు. కాబట్టి ఐదేళ్లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం అనే క్లయిమ్ వైసిపి నేతలు చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగులతో కలిసి ఉద్యమించే అవకాశం వైసీపీకి ఉంది.
నిజంగా అలా చేస్తే ప్రజల్లో పార్టీ ఇమేజ్ క డా పెరుగుతోంది. కానీ రాష్ట్రంలో తన ప్రత్యర్థులతో కలిసి ఉన్న బిజెపికి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్రంలో మద్దతిచ్చిన వింత పరిస్థితి వైసిపిది.చంద్రబాబు, పవన్ పై ఒంటికాలిపై లేచే జగన్మోహన్ రెడ్డి బీజేపీపై అంతే తీవ్రంగా ఈ అంశంపై పోరాడగల ధైర్యం చేస్తారా అనేది రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పోలవరం, అమరావతి,
వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఈ మూడు ప్రస్తుతం ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నవి. అమరావతిపై వైసీపీ ఇప్పటికీ అస్పష్టమైన స్టాండ్ తోటే ఉంది . పోలవరం నిర్మాణాన్ని రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు వెనక తీసుకుపోయిందంటూ టిడిపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా దానికి సరైన కౌంటర్ వైసీపీ నుంచి రావడం లేదు. ఇక వారికి మిగి లింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. క టమి నేతల అస్పష్ట ప్రకటనల మధ్య స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విపక్షాలు ఉద్యమిస్తే కచ్చితంగా ప్రజలు మద్దతు వారికి ఉంటుంది.

# బీసీల 42 శాతం రిజర్వేషన్ల కొరకు భారీ సదస్సు..



జమ్మికుంట: ఇందిరానగర్ లోనీ దినేష్ కన్వెన్షన్ లో జరగనున్న బీసీ హక్కులు బీసీ లకే దక్కాలి, బీసీ రిజర్వేషన్లు ప్రజాస్వామిక హక్కే అనే నినాదంతో మానవ హక్కుల వేదిక డా , తిరుపతయ్య, ఆధ్వర్యంలో జరిగే బిసి సదస్సుకు మద్దతు గా దూదేకుల నూర్బాష జమ్మికుంట మండల అధ్యక్షుడు మహమ్మద్ బందే అలీ,ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించిన గుల్జార్ మస్జిద్ ( జామ మస్జిద్ ) అధ్యక్షుడు హుస్సేన్. అన్ని వర్గాల బీసీ లందరూ హాజరై విజయవంతం చేయాలని దూదేకుల నూర్బాష జమ్మికుంట మండల అధ్యక్షుడు మహమ్మద్ బందే అలీ, పిలుపునిచ్చి మాట్లాడుతూ మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల సాధనకై నిర్వహించ తలపెట్టిన భారీ సదస్సును యువతి యువకులు , మహిళలు, విద్యార్థులు, బీసీ నాయకులు, కార్యకర్తలు, మేధావులు, బీసీ రిజర్వేషన్ బీసీ – ఏ బి,ఈ కోరుకునే వారందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సదస్సుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి 42% బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు టి చిరంజీవి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీ మనోహర్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ జీవన్ కుమార్, సామాజిక న్యాయ వేదిక నాయకులు రంగు రాజేశం, హాజరు కానున్నారని వారు తెలిపారు. బీసీ వర్గాలకు చెందిన అన్ని కులాల్లోని విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, మహిళలు, వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీ నాయకులు కలిసి తమ న్యాయమైన హక్కుల గురించి అధికారంలో ఉన్న, ఎప్పటికైనా అధికారంలోకి రాగల అన్ని పార్టీలను 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే విధంగా డిమాండ్ చేయాలన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి స్థానిక సంస్థల చట్టసభలలో తమ జనాభా దామాషాలో రిజర్వేషన్లకు, కోర్టులు అడ్డురాని విధంగా, రాజ్యాంగ సమ్మతంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు.
రాష్ట్రంలోనే కాకుండా కేంద్ర సంస్థల్లోనూ ఆ మేరకు రిజర్వేషన్లు పెంచాలన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీలలో ఏ,బి,సి,డి ఈ వర్గీకరణ విద్య, ఉద్యోగ రంగాల్లోనే కాదు రాజకీయ రంగంలో కూడా ఉండాలన్నారు. అన్ని స్థానాలలో, అన్ని వర్గాల మహిళలకు వారి దామాషా ప్రకారం ప్రాతినిధ్యము ఉండాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నాటికి అన్ని పార్టీలు కలిసి పెంచిన రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్ జహీరుల్ ఖాద్రి , వహీద్, అక్బర్, అలి%శీ%, అష్రఫ్, సజ్జద్ మహమ్మద్, రషీద్ , చారి, స్టార్ మొబైల్స్ ఫక్రొద్దీన్, షరీఫ్, అరీఫ్, అబ్బు, తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యలను కాలయాపన లేకుండా త్వరగా పరిష్కరించాలి

**గుట్టలు గుట్టలుగా దరఖాస్తులు అరకొరగా పరిస్కారమా**
**అన్నం పెట్టె అన్నదాతలను అరిగోసపెట్టకండి**
**జిల్లా అదనపు కలెక్టర్ ని కోరిన మద్దెల దినేష్**



రామగుండం:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా ఏర్పాటు చేసిన రేవన్యూ సదస్సులో జిల్లాలో చాలా మంది రైతులు వివిధ రకాల భూ సమస్యల పరిష్కారం కోసం మీ సేవలలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సుల్లో, జిల్లా కేంద్రంలోని, మరియు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా దరఖాస్తులు చేసుకున్న ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం కావడంలేదని ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్‌రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఛాంబర్ లోని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణు గారిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కారం కోసం బాధితులు వారి కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, జిల్లా కలెక్టర్, స్థానిక మండలాల తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా అనేక విధాలుగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గొప్పగా ప్రచారం చేసి రైతంగం సమస్యలు పరిష్కరస్తామని గొప్పలు చెప్పడం జరిగిందని, గత ప్రభుత్వం ధరణి చట్టం వల్ల సరైన ఆప్షన్స్ లేక కబ్జా లో ఉన్న వారికి పట్టా పాస్ బుక్ లేక పోవడం, వారసులు మరణించిన వారి భూములను క డా వారి కుటుంబ సభ్యుల పేర్ల పై క్రమబద్ధీకరణ చేయకపోవడం, భూమి ఎక్కువగా ఉంటే తక్కువగా, తక్కువగా ఉంటే ఎక్కువగా ఉండడం లాంటివి నమోదైనాయని, అలాగే గతంలో కొనుగోలు చేసిన భూములు పట్టా పాస్ బుక్ లలో అసైన్డ్ భూములని పడడం జరిగిందని, ఇలాంటివి భూ భారతి చట్టం ద్వారా అర్హులైన రైతులకు సవరణ చేస్తారునుకుంటే అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, దాని వల్ల రేవన్యూ సదస్సులు ఉపయోగం లేకుండా పోయిందని, అలాగే జిల్లాలో కొన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల, కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలతో బ్రతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వచ్చిన వారి భూములను అక్రమంగా ఆర్ఓఆర్ చేయించుకొని రైతు బంధు తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను అక్రమంగా పొందుతూ వలస పోయిన వారికి అన్యాయం జరిగిందని, జిల్లాలో ఇంకా అనేక రకాల భూసమస్యల పరిష్కారానికి నోచుకోక బాధితులు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూసమస్యలను సులభంగా పరిష్కారం చేయాలనే ఆలోచనతో మేధావులతో చర్చించి భూభారతి చట్టం ప్రవేశపెట్టి దాని ప్రకారం బాధితులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వం ఏమో భారీగా ప్రచారం చేస్తూ లోపు భూసమస్యల ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, పరిష్కారం చేయలేదని దీని వల్ల భూసమస్యల బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కావున జిల్లాలో ఉన్న ప్రతి భూసమస్యలను పరిష్కరించాలని, వాటి కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని మీ ద్వారా వారికి న్యాయం చేయాలని కొరామని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడుతలలో 605 మండలాలో 10,889 రేవన్యూ సదస్సులు జరగ్గ 8,27,330 దరఖాస్తులు వచ్చాయాని సమాచారం, ఇందులో కేవలం 8.53 శాతం దరఖాస్తులనే అమోదించారని, ఇందులో ఆన్లైన్ లో నమోదు చేసిన దరఖాస్తులు 2.52 శాతమే ఉన్నాయని సమాచారం ఇక పెద్దపల్లి జిల్లాలో చూసుకుంటే వాటిని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. అన్నం పెట్టె అన్నదాతలను అరిగోస పెట్టకుండా రైతుల సమస్యలను పరిష్కరించాలని దినేష్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

# స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?



ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది.

# తెలుగు నేర్చుకుంటున్న ప్రియాంక చోప్రా..





సూపర్ స్టార్ మహేష్ బాబు- దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో పాన్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ 'వారణాసి' టైటిల్ అనౌన్స్‌మెంట్ హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో గ్రాండ్‌గా జరిగింది. మహేష్ ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌తో జక్కన్న ప్రపంచానికి కొత్త రూపాన్ని పరిచయం చేస్తే, బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా ఈవెంట్‌లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు. స్టేజ్‌పైకి వచ్చిన ప్రియాంక చోప్రా తెలుగులో "హలో హైదరాబాద్","తగలబెట్టేద్దామా?" అంటూ అభిమానులను పలకరించడంతోహాల్ అంతా హర్షధ్వనులతో మార్మోగింది. ఈ క్యూట్ తెలుగు డైలాగులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఈవెంట్ కోసం ప్రత్యేకంగా తెలుగు ప్రాక్టీస్ చేసిన వీడియోను కూడాఆమె షేర్‌చేయగా, ఆ డెడికేషన్‌పై నెటిజన్లు ఫిదా అవుతున్నారు."సినిమాలో కంటె లైవ్ స్టేజ్‌పై తెలుగు మాట్లాడడం చాలా కష్టం"అంటూ ప్రియాంక చెప్పిన మాటలు అందరిదృష్టిని ఆకర్షించాయి. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక డైరీ మెయింటైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. 'వారణాసి' చిత్రంలో ప్రియాంకనే హీరోయిన్ అని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఆమె 'మందాకిని' పాత్రలో కనిపించనున్నారు.ఇప్పటికే విడుదలైన ఆమె ఫస్ట్‌లుక్ భారీ హైప్ క్రియేట్ చేస్తుంది. గుహలో దేవతా విగ్రహాల మధ్య చీర కట్టుకుని గన్ పట్టుకుని కనిపించిన మాస్ అవతారం అందరినీ ఆశ్చర్యపరిచింది. టీజర్‌లో ప్రత్యేకంగా చూపించిన చిన మస్తానా దేవి టెంపుల్ సన్నివేశం చర్చనీయాంశమైంది. ప్రమాదంలో చిక్కుకున్న ప్రియాంకను హీరో కాపాడే విజువల్స్ థ్రిల్లింగ్‌గా అనిపించాయి.

చిన మస్తాదేవి తాంత్రిక పూజల్లో ఆరాధించే రౌద్రరూపం. ముఖ్యంగా టిబెటిన్ తాంత్రిక సంప్రదాయాల్లో ఈ దేవికి ప్రత్యేక స్థానం ఉంది.చిన్నమస్తా, ప్రచండ చండిక, జోగని మావంటి పేర్లతో కూడా పిలుస్తారు. టీజర్‌లో ఈ దేవి విగ్రహం చుట్టూ రూపొందించిన సన్నివేశాలు సినిమాకు కీలకం కానున్నాయని తెలుస్తోంది.

ఈ పాత్రను రాజమౌళి ఎలా తీర్చిదిద్దారు? ఏ ప్రపంచంలో ఆమె పాత్ర విస్తరించబోతుంది? అనేదానిపై అభిమాను ల్లో భారీ ఆసక్తి నెలకొంది. మహేష్ - రాజమౌళి కాంబినేషన్‌కు తోడు ప్రియాంక చోప్రా శక్తివంతమైన పాత్రలో కనిపించబోతుం డటంతో 'వారణాసి'పై ఎక్స్‌పెక్టేషన్స్ మరింత పెరిగాయి.

# 'హీరామండి 2'లో తమన్నా - కాజల్ అగర్వాల్ ..



సంజయ్ లీలా భన్సాలీ రూపొందించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'హీరామండి: ది డైమండ్ బజార్' తొలి సీజన్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. మనీషా కోయిరాలా, సోనాక్షి సిన్హా, అదితి రావు హైదరి, రిచా చద్దా, షర్మిన్ సెగల్ తదితర నటీమణులందరినీ భన్సాలీ తన ప్రత్యేక మేకింగ్‌లో అద్భుతంగా చూపించాడని ప్రేక్షకులు, విమర్శకులు ప్రశంసించారు. విడుదలకు ముందు కథ పాత కాలానికి చెందినదన్న కారణంగా సందేహాలు వ్యక్తమైనప్పటికీ, రిలీజ్ తర్వాత ప్రేక్షకుల ప్రేమ ఆ సందేహాలన్నింటినీ పక్కన పెట్టించింది.ఇక ఇప్పుడు సీక్వెల్ కి గ్రీన్ సిగ్నల్ లభించింది. సిరీస్ రైటర్ విభు పూరి తాజాగా ఇచ్చిన సమాచారం ప్రకారం, 'హీరామండి 2' స్క్రిప్ట్ దశలో ఉంది మరియు త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. తొలి సీజన్‌లోని ప్రధాన పాత్రలే కొనసాగనున్నాయి. అయితే వీటితో పాటు పలు కొత్త పాత్రలు కూడా జోడించనున్నారట. బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, కొత్త పాత్రల్లో రెండు కీలక రోల్స్ కోసం తమన్నా భాటియా, కాజల్ అగర్వాల్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం.. సౌత్ మార్కెట్‌లో 'హీరామండి' మరింతగా కనెక్ట్ కావడం,ఈ ఇద్దరు నటీమణులు పాన్-ఇండియాలో గుర్తింపు తెచ్చుకోవడం, తొలి సీజన్‌లో నటించిన నటీమణుల వయస్సు, ఇమేజ్‌కి ఇవి సరిపోవడం.తమన్నా (వయసు 35),కాజల్ (40) స్టార్ హీరోయిన్స్‌గాను, ఐటమ్ నంబర్లలోనూ, హైవాల్యూ ప్రాజెక్ట్స్‌లోనూ సత్తా చాటిన నటీమణులే. ఓటీటీ ప్రాజెక్టులు కెరీర్‌లో మళ్లీ కొత్త బాటలు తీసుకువెళ్లే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

సౌత్‌లో బలమైన ఫాలోయింగ్ ఉండటం, ప్యాన్-ఇండియా ఆకర్షణ కలగడం వల్ల ఈ ఇద్దరూ భన్సాలీ కథలో సరిగ్గా సరిపోతారనే టాక్ ఫిల్మ్ సర్కిల్స్‌లో నడుస్తోంది. అయితే అధికారిక ప్రకటన మాత్రం త్వరలోనే రానుంది. ఒకవేళ ఈ కాంబినేషన్ ఫైనల్ అయితే, 'హీరామండి 2'లో తమన్నా%-%కాజల్ స్క్రీన్ ప్రెజెన్స్ మరో లెవెల్‌లో ఉండనుంది.


# ధనుష్ సరసన మళ్లీ సాయిపల్లవి?





కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, నటి సాయిపల్లవి వెండితెరపై విజయవంతమైన జోడీగా గుర్తింపు పొందారు. వీరిద్దరి కలయికలో వచ్చిన 'మారి 2' చిత్రం, అందులోని 'రౌడీ బేబీ' పాట సృష్టించిన సంచలనం అందరికీ తెలిసిందే. ఈ హిట్ పెయిర్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ధనుష్ తన 55వ చిత్రం కోసం దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామితో కలిసి పనిచేయనున్న విషయం విదితమే. ఈ చిత్రంలో కథానాయిక పాత్ర కోసం చిత్రబృందం సాయిపల్లవిని సంప్రదించినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆమెతో చర్చలు కూడా జరిపారని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. 'మారి 2'లో వీరిద్దరి కెమిస్ట్రీకి అద్భుతమైన స్పందన రావడంతో, ఈ కొత్త ప్రాజెక్టుపై అంచనాలు పెరుగుతున్నాయి. 'అమరన్' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం సాయిపల్లవి బాలీవుడ్‌పై దృష్టి సారించారు. ఆమె హిందీలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణ' చిత్రంలో నటిస్తున్నారు. దీంతో పాటు ఆమె నటించిన 'మేరే రహో' అనే మరో హిందీ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ధనుష్ సినిమాలో ఆమె నటించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# నా పేరుతో ఎవరో మెసేజులు పంపుతున్నారు..



నటి అదితి రావు హైదరీ సోషల్ మీడియాలో తన పేరుతో జరుగుతున్న మోసాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు దేశీయ, పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అదితి, పెళ్లి తర్వాత కూడా తన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తూనే ఉంది. తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె, తాజాగా వాట్సాప్‌లో తన ఫోటోలను ఉపయోగిస్తూ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తున్నారని వెల్లడించారు. అదితి షేర్ చేసిన స్క్రీన్‌షాట్‌లో, ఒక వ్యక్తి ఆమె పేరు, ఫోటోలను ఉపయోగిస్తూ ఫోటోగ్రాఫర్లకు ఫోటోషూట్ల పేరుతో మెసేజులు పంపుతున్నట్లు కనిపించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్‌లో క్లారిటీ ఇస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు. ఈ రోజు కొంతమంది నాకు చెప్పిన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. వాట్సాప్‌లో నా ఫోటోలను ఉపయోగిస్తూ ఎవరో 'ఫోటోషూట్' కోసం మెసేజులు పంపుతున్నారు. అవి నేను పంపినవి కావు. నేను ఎప్పుడూ నా పర్సనల్ నంబర్‌ను వర్క్ కోసం ఉపయోగించను. నా అధికారిక పనులు అన్నీ నా టీమ్ ద్వారానే జరుగుతాయి. అలాంటి మెసేజులు వస్తే వెంటనే నా arhconnect టీమ్‌కి తెలియజేయండి. నాకు ఎప్పుడూ అండగా నిలిచే అభిమానులకు ధన్యవాదాలు," అని అదితి పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవల పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా ఫేక్ అకౌంట్లతో మోసాలకు గురవుతున్న సందర్భంలో, ఇప్పుడు అదితి పేరు, ఫోటోలతో కూడా మోసగాళ్లు దోపిడీకి ప్రయత్నాలు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అభిమానులు, ఫోటోగ్రాఫర్లు ఇలాంటి నకిలీ మెసేజులను నమ్మవద్దని ఆమె స్పష్టం చేశారు. ఇక అదితి రావు హైదరి కొద్ది రోజు క్రితం సిద్ధార్థ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ జంట ప్రస్తుతం వైవాహిక జీవితంతో పాటు ప్రొఫెషనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేస్తూ దూసుకుపోతుంది. అదితి అప్పుడప్పుడు సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫోటోలు షేర్ చేస్తూ కాక రేపుతూ ఉంటుంది.

# నటి కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం



ప్రముఖ నటి కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఐక్యరాజ్య సమితికి చెందిన యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్‌ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) ఇండియా విభాగానికి ఆమె సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమితులయ్యారు. ఈ కొత్త బాధ్యతలు చేపట్టడం పట్ల కీర్తి సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తు న్నానని ఆమె తెలిపారు. ఈ నియామకంపై యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ మాట్లాడుతూ.."కీర్తి సురేశ్‌తో భాగస్వా మ్యం కుదుర్చుకోవడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రేక్షకులతో ఆమెకున్న బలమైన అనుబంధం, పిల్లలహక్కులు, వారి శ్రేయస్సు కోసం పోరాడటానికి బలమైన వే దిక అవుతుందని విశ్వసిస్తున్నాం" అనిఆమె పేర్కొన్నారు. "ప్రతి చిన్నారికి సంతోషంగా, ఆరోగ్యంగా జీవించే హక్కు ఉంది. వారి నేపథ్యంతో సంబంధం లేకుండా, ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం గౌరవంగా ఉంది" అని కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల శ్రేయస్సే దేశానికి పునాది అని తాను బలంగా నమ్ముతానని ఆమె వివరించారు. ఇక కీర్తి సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె నటించిన 'రివాల్వర్ రీటా' చిత్రం ఈ నెల 28న విడుదలకు సిద్ధమవుతోంది.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3- 2-92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana- 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor- Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343